మానవత్వం ఎలుక కెందుకు?

చంద్రశేఖర అజాద్

కళ్ళనిండా నిప్పులు కణకణ మండి పొగలు సెగలు క్రక్కుతున్నాయి.

నిప్పులు .... ఎండలు .... యెండలు పెరిగే నిప్పుల్లో పోటీగా, సూటిగా చూస్తున్నాడతను. రావిచెట్టు నీడ. నీడక్రింద వెచ్చటి వడగాలిలో మరింత వెచ్చగా ఉన్నాడతను.

కళ్ళు దేన్నో పరికిస్తున్నాయి.

ఆలోచన మనస్సుతో పోటీ పడ్తుంది.

ఆవేశంతో శరీరం ఎగిరెగిరి పడుతోంది.

ఖాళీ చేతులు, ఖాళీ కడుపు, యెటు చూసినా శూన్యం! ప్రక్కనే పడుకున్న మనుష్యుల్ని చూశాడు.

వారందరిలా తనూ "అనాధ" "దిక్కులేని వాడు"

ఆలోచన కాల్చేస్తోంది.

తను భోంచేసి ఎన్నాళ్ళయింది?

ఆకలి వెయ్యటంలేదు. ఎందుకని?

4

కరడు గట్టుకుపోయింది గుండె, మనస్సు.

కసి....పగ...

ఎవరిమీద?

ఎందుకు? ఎందుకు?

"నీ పేరేమిటి?"

"సృజన్."

"చాల బాగుంది."

"అవును. అందుకే మా బాబు పెట్టుకున్నాడు."

"నీలో ఏదో కళ ఉంది. సృజనాత్మకమైన నీలోని కళల్ని సమాజానికి అంకితం చేయాలని ఆయన ఆశయం కావచ్చు."

"అవును. నాలో జీవకళ ఉండేది ఒకప్పుడు. ఇప్పుడది పోయింది ఆయనతోపాటే. నాలో సృజనాత్మకత యే విషయంలోనూ, యెక్కడా విజయం పొందలేదు. చివరకు ఇలా ఈ రావిచెట్టు నీడలో..ఎండిన డొక్కల్లో శూన్య హస్తాల్లో...."

"బాధపడకు."

"బాధా....కాదు....కసి తీర్చుకుంటాను."

గతం కళ్ళముందు పరుచుకుంటోంది....

2

రేణుక కళ్ళలోకి చూశాడు రవి.

"సృజన్ పడుకున్నాడా."

"ఆఁ."

"వాడ్ని ఈ రోజు సినిమా హాల్లో చూశాను" అన్నాడు రవి.

"ఇంటికి త్వరగా నే వచ్చేశాడే" అంది రేణుక అనుమానంగా.

"నన్ను చూచి లేచి వచ్చాడు."

"అందుకే కాబోలు ఈ రోజు మానంగా ఉన్నాడు."

"రేణుకా... వాడ్ని గురించి నేననుకున్న దేవీ జరగవు" అన్నాడు రవి.

"ఏమిటలా అంటున్నారు?" కంగారుగా అంది.

"అవును. వాడ్ని గమనించాను. వాడి జీవితంలో డాక్టర్ కాలేడు. ప్రతి చిన్న విషయానికే కదిలిపోయే మన సత్వం వాడిది. వాడు డాక్టర్ కావటం చాలా కష్టం. వాడ్ని డాక్టర్‌ను చేయాలని నే నెంతగా ఆశ పడ్డానో నీకు తెలుసు. కాని వాడు ఓ పద్ధతిలో పోవటం లేదు. ఆలోచించటంలేదు. ప్రతి విషయం సీరియస్‌గా తీసుకుంటాడు. ప్రతిదాన్ని తనతో పోల్చుకుంటాడు. వాడెలా మారతాడో ఊహించటం కష్టంగానే ఉంది" అన్నాడు రవి.

"ఏమిటో నాకేమీ అర్థం కావటం లేదు" అంది రేణుక.

"లేదు. నీ కర్థంకాదు. వాడి భవిష్యత్‌లోకి నేను చూస్తున్నాను. నా ఆశయం నీకు తెలుసు. నా బిడ్డను ఈ సమాజానికి యేదో విధంగా ఉపయోగపడేలా చెయ్యాలనేది నా కోర్కె...." అన్నాడు పడుకుంటూ.

తను పడుకున్నాడన్నమాటే గాని, తండ్రి మాటలు వింటూనే వున్నాడు.

రేణుక నిట్టూర్చింది.

రవి రచయిత. కలంతో మాత్రమే యుద్ధం ప్రకటించకుండా అతను జనంలోకి వెళ్ళి పని చేస్తూంటాడు. కొండలు....కోనలు చుట్టివస్తుంటాడు. ఆ అనుభవాల్తో రచనలు చేస్తుంటాడు.

3

“అబ్బా!” అనుకున్నాడు సృజన్.

గండుచీమ కసిగా కరిచింది. ఎర్రటి రక్తపుబొట్టు అప్పుడే వెలిసింది. చీమ కొంచెంసేపు గిలగిలలాడింది. తిరిగి బయలుదేరింది. సృజన్ కళ్ళు మిలమిలలాడాయి. చిరు దరహాసం ఒకటి పెదవులమీద వెలిసింది.

రక్తంవంక గండుచీమవంక మార్చి మార్చి చూశాడు. అది వెళ్తూంది.

టప్పున దానిమీద చెయ్యి పడింది.

నలిగిపోయిందది.

నవ్వుకున్నాడు సృజన్.

“మనిషిని మనిషే కాదు. జంతువులు కూడా బలహీనుల్ని నాశనం చేస్తున్నాయి. ఇది ప్రకృతి ధర్మమా” అనుకున్నాడు.

కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి. లేచి నిలబడ్డాడు. బద్ధకంగా ఓసారి వళ్ళు విరుచుకున్నాడు. అంతే....

నోటివెంట మాట రావటంలేదు.

గుండె పట్టేసింది.

కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఒకటి.... రెండు నిమిషాలు.... గుండె సర్దుకుంది.

నిట్టూర్చాడు.

కడుపు ఖాళీగా ఉన్నప్పుడు అలా చేయటం పొరపాటే. మెల్లగా నడుస్తున్నాడు. బట్టలన్నీ భయంకరంగా మాసిపోయి ఉన్నాయి. తలమీద వెంట్రుకలు రాగి వెంట్రుకల్లా ఉన్నాయి. వాటికి నూనెరాసి ఎన్నాళ్ళయిందో... వంటికి బిగుతుగా అంటుకుపోయిన బట్టల్లో

సృజన్ నడుస్తున్నాడు.

దూరంనుండి చూస్తే హాలీవుడ్ హీరోలా ఉన్నాడతను. ఆ నడకలో పట్టుదల కనిపిస్తోంది.

ఖరీదయిన కారొకటి ప్రక్కనుండి దూసుకుపోయింది.

ఆలోచనల్లో ఉన్న సృజన్ ఉలిక్కిపడి చూశాడు. ఆ కారులో ఉన్న వ్యక్తి రూపం మనసులో మెదులుతోంది. అతను! అతను!

అడుగులు వడివడిగా పడుతున్నాయి.

ఆగాడు. ఎదురుగా బ్రహ్మాండమయిన భవనం.

ఇంద్రభవనం అనబడే దానికి దీటుగా ఉంది. బయట నుండి చూస్తుంటే అందమయిన పచ్చికబయలు కనపడుతోంది. అందులో రకరకాల పూల మొక్కలు వాటి నడుమ వాటర్ ఫౌంటెన్ మరింత అందంగా వుంది. దూరంగా గ్యారేజ్...అందులో అత్యాధునికమైన కారు కనిపిస్తోంది.

సృజన్ నేమ్ బోర్డువంక చూశాడు.

"రాజారావ్ బిల్డింగ్స్."

పెదవులు మెల్లగా విచ్చుకున్నాయి.

గేటుముందు ప్రహారా కాస్తున్న ఘూర్కా ఇందాకటి నుండి గమనిస్తున్నాడు.

"క్యాహోనా."

ఉలిక్కిపడ్డాడు. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. అతను దొంగను చూసినట్లు చూస్తున్నాడు.

వెనక్కు తిరిగాడు సృజన్. గుండెల్లో అగ్నిపర్వతాలు రగులుతున్నాయి. ఎత్తుగా నిలబడ్డ భవనం వికటాట్టహాసం చేస్తోంది. మెల్లగా నడుస్తున్నాడు. రంగు రంగుల దుస్తులు ధరించిన అందమైన యువతీయువకులు

వెళుతున్నారు. వారి కళ్ళల్లో అంతులేని ఆనందం తొణికిసలాడోంది.

యువ్వన ప్రాంగణంలోకి అడుగిడుతున్నారు వారంతా. వారి ఆలోచనలు ఆ మొఖల్లో ప్రతిబింబిస్తున్నాయి.

సృజన్‌కు చాలా దిగులనిపించింది. భోరున యేడ్చేయాలనిపించింది చల్లని ఒడిలో, గుండెల్లో తాపం తీరేదాకా.

అమ్మ ఒడిలో తాను....తన జుట్టు నిమురుతూ కళ్ళలోకి చూసే అమ్మ....తన బట్టల్ని సైతం తానే సెలక్టు చేసి బడికి పంపించే అమ్మ....తన రాకకోసం యెదురు చూసే అమ్మ....తన భవిష్యత్‌ను గురించి గొప్పగా ఊహించిన అమ్మ....

“అమ్మా” మెల్లగా పెదవులు విచ్చుకున్నాయి

ఆ మాటల్లో ఆవేదన, దుఃఖం మిళితమయ్యాయి.

“అమ్మా, ఎందుకిలా చేశారు. మీరు నన్ను ఒంటరి వాడ్ని చేశారు” గొణుక్కున్నాడు.

“ నేను యేకాకిని.”

కళ్ళనిండా నీరు గిరుక్కున తిరిగి బుగ్గలమీద జారిపోయింది. మోచేత్తో ఓసారి కళ్ళు తుడుచుకున్నాడు. చేతికి తడి అయింది. ఆ మేర ఎర్రటి శరీరం కనపడింది. మర్రిచెట్టు కిందకు చేరాడు. చీకట్లు పడుతున్నాయి.

ఒక్కొక్కరే ఆ చెట్టు నీడకు చేరుతున్నారు—జోలెలు పుచ్చుకొని. వీధి కుక్కలు రెండు కరుచుకుంటున్నాయి. సృజన్ వెళ్ళి కూర్చున్నాడు. శూన్యంలోకి చూస్తూ.

జోలె తెరిచి అందులో ఉన్న పదార్థాల్ని తీస్తున్నాడు ఆ భిక్షగాడు. అతని దగ్గర అదోరకమైన వాసన

వేస్తోంది. నల్లటి బొచ్చెలో వేశాడు ఓ అన్నం గడ్డ. దానిమీద పులుసో, చారో పోశాడు. కలిపి నోట్లో పెట్టుకుంటూ చూశాడు.

సృజన్ తనవంకే చూస్తున్నాడు.

ఆ చూపులో యే భావంలేదు. నిస్తేజంగా వున్నాయి కళ్ళు.

"రా.... ఓ ముద్ద తిందువు" అడిగాడు.

సృజన్ యేం మాట్లాడలేదు.

"నిన్నే."

"ఆఁ."

"బువ్వ తిందువు."

"బువ్వా."

"వన్నమయ్యా."

అతను లేచి వచ్చాడు.

"చేయిపట్టు."

సృజన్కు తెలియకుండానే అతని చేయి చాచబడింది.

చేతినిండుగా పెట్టాడు.

"తిను."

సృజన్ మాట్లాడలేదు. చేతిలో ముద్దవంక ఓ సారి చూశాడు. కళ్ళవెంట నీరు గిరుక్కున తిరిగింది.

"తినంటే...."

గబగబ తినేశాడు.

అతని కళ్ళలో ఆనందం కనపడింది.

ఇంకో ముద్ద చేతిలో ఉంచాడు.

కాలం గడిచిపోతూనే వుంది.

సృజన్ ప్రక్కకు చూశాడు.

తనకు అన్నం పెట్టిన వ్యక్తి కాళ్ళు ముడుచుకొని

పడుకొని ఉన్నాడు.

అతనెవరో తనకు తెలియదు. తాను బలవంతం చేసి అన్నం తినిపించాడు. యేమిటీ అనుబంధం అనుకున్నాడు.

తన జీవితంలో తనకున్న అతి తక్కువ అనుభవాల్లో మానవుల్లోని కుట్రల్ని, మోసాల్ని, అవకాశవాదాన్ని చూశాడు. అమ్మ, నాన్నలను తప్పించి ఇతర త్రా ప్రేమానుబంధాల గురించి తెలియదు. కానీ మానవుల్లోని అవలక్షణాల స్థానంలో నే ప్రేమ.... అనుబంధం.... అన్నీ ఉన్నాయి. ఈ మనిషే ప్రేమిస్తాడు! ఈ మనిషే ప్రాణాలు తీస్తాడు! ఎంత విచిత్రం అనుకున్నాడు. మనిషి మనిషిగా బ్రతికితే ఎంత బాగుంటుంది....అనుకున్నాడు.

"మనిషి మనిషిగా బ్రతకాలి. కానీ కొన్ని మృగాలు మనుషుల్ని కాపలా కాస్తున్నాయి. దోచుకుంటున్నాయ్. పీక్కుతింటున్నాయ్. ఇప్పుడు నా కర్తవ్యం యేమిటో చెప్పు" నాన్న కంఠం గంభీరంగా పలుకుతోంది.

సృజన్ కళ్ళు చూస్తున్నాయి.

ఆ కళ్ళలోని వెలుగు దగ్గరకు రావటానికి భయపడ్తోంది చీకటి.

4

అర్ధరాత్రి ఎందుకో మెలకువ వచ్చింది సృజన్‌కి.

తలుపు ఉండి ఉండి మ్రోగుతోంది సంకేతంలా. వింటూ పడుకున్నాడు. అమ్మ వెళ్ళి తలుపుతీసింది. ఎవరో వ్యక్తి లోపలకు వచ్చాడు. అమ్మ వెంటనే తలుపు మూసింది. యెవరా వ్యక్తి? గడ్డం బాగా పెరిగి ఉంది. తల వెంట్రుకలు నల్లగా ఉన్నాయి. ఆ వ్యక్తి నిలబడటంలో పోలిక వుంది. ఎవరతను?

"రండి" అంటోంది అమ్మ.

"సృజన్ నిద్రపోయాడా" అంటున్నాడతను.

ఎవరు? తన పేరు తెలిసిన వ్యక్తి తనకు తెలియకుండా యెవరున్నారు?

"నిద్రపోతున్నాడు" అమ్మ సమాధానం.

అతను తనవైపుకు నడిచి వస్తున్నాడు.

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

ఆయన వచ్చి ఓసారి ఆప్యాయంగా జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చాడు.

ఆ స్పర్శలో భావకందని మమకారం ఉంది.

"నాన్న వచ్చారు" అనుకున్నాడు లేవకుండానే.

"రండి భోజనం చేద్దురు" అంది అమ్మ.

అమ్మ వెంట బయలుదేరాడు. ఈ నడుమ నాన్న సరిగా యింటికి రావటం లేదు. యెప్పుడో అర్థరాత్రి వస్తాడు. అమ్మనడిగితే యేమేమో చెబుతోంది. అసలు నాన్న రూపమే మారిపోయింది. తనుకూడా గుర్తుపట్టలేనంతగా... అసలు నాన్న ఏం చేస్తున్నట్లు....!

వంటింట్లో శబ్దాలు అవుతున్నాయి.

భోంచేస్తూ మాట్లాడుకుంటున్నారు. సృజన్ మెల్లగా నడిచి వంటగది ప్రక్కన నిలబడ్డాడు.

"సృజన్ ఎలా చదువుతున్నాడు?"

"ఫర్వాలేదు."

"వాడి బాధ్యత నీదే."

"మీకు బాధ్యత లేదా."

"రేణూ" అన్నాడు రవి. "నా సంగతి నీకు తెలుసు. రాను రానూ పరిస్థితులు విషమిస్తున్నాయి. ఇంక ఇలా రావటం కూడా సాధ్యపడక పోవచ్చు."

"ఎందుకని?" రేణుక గొంతు వణికింది.

"త్వరలోనే మేం ఓ కార్యక్రమం నిర్వహించబోతున్నాం.... దానికి చెందిన పనులున్నాయి."

"ఏమిటా పని?"

"అది రహస్యం."

"నా దగ్గర కూడానా."

"రేణూ.... అది పెద్ద రహస్య విషయం. అది మరొకరికి తెలియచేయకూడదనేది మా నియమం. నన్ను అర్థం చేసుకో. ఆ విషయం చెప్పనందుకు నన్ను క్షమించు."

"పోనీ మీరు చేసేపని యేమిటో చెప్పండి."

రవి కొంచెం ఇబ్బందిగా చూశాడు.

చేయి కదుపుతూ మెల్లగా అన్నాడు.

"నాటు బాంబులు తయారుచేయటం."

సృజన్ ఉలిక్కిపడ్డాడు. మెల్లగా మంచం దగ్గరకు చేరాడు.

రేణుక చాలాసేపు మాట్లాడలేదు. ఆమెకు భవిష్యత్ అంతా శూన్యంలా కనిపిస్తోంది.

"ఏమిటి మాట్లాడవు."

"ఏం మాట్లాడను. మీరు మాకు అందనంత దూరంలోకి వెళుతున్నారు."

"రేణూ.... నువ్వు మన గురించి ఆలోచిస్తున్నావు. లక్షలాది ప్రజానీకం గురించి ఆలోచించలేవు. ఎంతసేపూ నీ భర్త.... నీ బాబూ.... నీ సంసారం...."

"తప్పా?"

"కానీ ఈ దేశంలో ఎందరు మానవులుగా బ్రతుకుతున్నారు. ఆలోచించు."

"అది మనకెందుకు?"

"మరెవరికి కావాలి. సృజన్ గురించి నీ కెందుకు

బాధ్యత."

"అమ్మను కనుక."

"నాకూ అంతే. ఈ గడ్డపై పుట్టి పెరుగుతున్నాను. నా ప్రజలంతా సుఖంగా, సంతోషంగా బ్రతకాలి. వాళ్ళ అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని భూస్వాములు, ధనవంతులు, వాళ్ళని దోచుకుంటున్నారు. చిత్రవధ చేస్తున్నారు. వాళ్ళ ఆటలు అరికట్టాలి."

"అందుకు మీరేం చేస్తారు."

"నరికేస్తాను."

"ఎవర్ని."

"దుర్మార్గుల్ని,"

"ఒకడు పోతే ఇంకోడొస్తాడు."

"కాదు. ఒకడ్ని నరికితే మరొకడికి బుద్ధి వస్తుంది. అప్పుడే ప్రజల్లో కదలిక వస్తుంది. దాన్ని విప్లవంగా మార్చుకుంటాం. ఈ దేశపు చీడపురుగుల్ని నాశనం చేసి మరో సమాజం నిర్మించుకుంటాం."

"మనుష్యుల్ని చంపటమా? దారుణం. రాను రానూ మీరు మరీ రాక్షసంగా మారిపోతున్నారు. హింసించటం మానవత్వం కాదు."

"రేణూ....మానవత్వం గురించి మనకెందుకీ వివాదం. నువ్వు చెప్పే మానవత్వం జనాన్ని పీక్కుతింటున్న తోడేళ్ళకు లేదు. పిచ్చిదానా! ఎలక్కి మానవత్వం ఎందుకుండాలి? పిల్లి కుంటుంది గనకనా! మానవత్వం అంటే ఏమిటి? విలాసాలు ఓ ప్రక్క....దుర్భరంగా బ్రతకటం మరో ప్రక్క....హింసకు హింసే మార్గం" ఆవేశంగా అన్నాడు.

రేణుక ఏం మాట్లాడలేదు.

"ఐయామ్ సారీ" అన్నాడు రవి కంట్రోలవుతూ.

"రేణూ! తిరిగి గంటలో వెళ్ళిపోవాలి. డబ్బుకు నీవేం ఇబ్బంది పడాల్సిన అవసరంలేదు. నేను వచ్చేదాకా ఈ అయిదువందలుంచు. సృజన్ చదువు విషయం గురించి జాగ్రత్త. నా గురించిన వివరాలేవీ వాడికి తెలియ గూడదు. మరలా త్వరలో నే కలుసుకోగలమనే ఆశిస్తాను."

రేణుక ఏం మాట్లాడలేదు.

తిరిగి రవి సృజన్ దగ్గరకొచ్చాడు. ఓసారి ఆప్యాయంగా తడివాడు.

"వస్తాను" రేణుకతో అన్నాడు.

ఆమె ఏం మాట్లాడలేదు.

"ఏమిటి మాట్లాడవు. భారత దేశంలో వీర నారులున్నారు. వారిని ఆదర్శంగా తీసుకో."

"త్వరగా రండి."

"ప్రయత్నిస్తా."

మెల్లగా తలుపు తెరుచుకుంది. కొద్ది క్షణాల తర్వాత మూసుకుంది.

అమ్మ వెక్కిళ్ళు వినపడుతున్నాయి.

5

ఆ రోజు ఉదయం సృజన్ పేపర్ చూస్తున్నాడు.

విప్లవకారుల చేతుల్లో భూస్వామి హత్య!

"ప్రముఖ భూస్వామిగా పరిగణించబడుతున్న శ్రీ ధర్మారావును కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. అంతకుముందు ధర్మారావు ఇంటిలోని ప్రాంసరీ నోట్లు నిన్నింటినీ కుప్పగా పోసి తగులబెట్టారు. ధర్మారావు భార్య కళ్ళముందే అతన్ని చిత్రవధ చేస్తుంటే

చూడలేక ఆమె స్పృహ తప్పింది.

ఈలోపు ధర్మారావు కేకలకు ప్రోగయిన జనాన్ని బెదిరించటానికి వారు నాటు బాంబులు వేశారు. విప్లవ నినాదాలు ఇచ్చారు. ప్రజలంటే తమకు కోపంలేదనీ, ప్రజల్ని మోసంచేస్తూ వారి ధన ప్రాణాల్ని దోచేవారిని చంపి, ప్రజల్ని రక్షించటమే తమ ధ్యేయం అని వారు చెప్పారు.

"విప్లవం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేసుకుంటూ వారంతా పారిపోయారు. మొత్తం అయిదు లక్షల విలువ చేసే బంగారం, రెండు లక్షల కరెన్సీ దోచుకోబడిందని 'ధర్మారావు' గారి భార్య తెలుపుతున్నా, వాస్తవానికి ఇంకా యెక్కువ ఉండవచ్చని అనధికార అంచనా. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు."

అదే పత్రికలో మరోచోట ఇంకో వ్యాఖ్యానం ఉంది.

"ధర్మారావుని హత్యచేయటం అనేది ఏ రకంగానూ సమర్థనీయం కాదు. అయితే ఆ పరిస్థితుల్ని కల్పించటంలో ఆయన పాత్ర ఉందనిపిస్తుంది. ఆయన ఇదివరకు అనేకమందిని గూండాలతో చంపినట్లు తెలుస్తోంది. ప్రజల్ని బెదిరిస్తూ ఎక్కువ వడ్డీలు గుంజటం, భూముల్ని ఆక్రమించటంలాంటి పనులు చేశాడు. మొత్తంగా ఆ గ్రామంలో ధర్మారావ్ పట్ల వ్యతిరేకత ఉంది. అయినా సరే ధర్మారావుని హత్యచేయటంతో పరిస్థితులు మరింతగా విషమించటం తప్పించి, ఆ పరిస్థితుల్లో యే మార్పు ఉండబోదు."

సృజన్ కు అర్థమయింది.

అయితే ఒకటే అనుమానం.

నాటు బాంబులు విసిరింది నాన్నేనా? ధర్మారావును చంపింది నాన్నేనా? అసలు ఈ సంఘటనలో నాన్న ఉన్నాడా? బంగారం, డబ్బు యేమయ్యాయి?

ఆలోచిస్తున్నాడు. మనస్సంతా అయోమయంగా ఉంది. అమ్మకేమయినా తెలుసా? ఊహుఁ తెలిసినా చెప్పదు. యేం చేయాలి? ఎలా తెలుసుకోవాలి?

ఈ సంఘటన జరిగి దాదాపు నెలకావస్తుంది. అయితే ఈ విషయంమీద అనుమానంమీద కొందరిని అరెస్టు చేయటం జరిగిందని పత్రికల్లో రాసినా అందులో రవి పేరు లేదు. అసలు ఈ నడుమ రవి ఇంటికి రావటం మానేశాడు.

రేణుక మాత్రం దిగులుగా ఉంటోంది. ఆమెలో ఓ రకమైన నిరాసక్తత ఏర్పడింది. ఏ క్షణాన యే ఘోరం వినాల్సి ఉంటుందో ఆమె ఆలోచించటంలేదు. ఆ పరిస్థితికి అలవాటుపడిపోయింది.

సరిగ్గా నెల తర్వాత అర్ధరాత్రి తలుపు చప్పుడయింది.

సృజన్ ఉలిక్కిపడి లేచాడు.

అమ్మ నిద్రపోతోంది.

మెల్లగా మంచం దిగి లైటు వేశాడు. ఆ తర్వాత తలుపు తీశాడు. లోపలకు దూసుకొచ్చాడు రవి. ఆ నిశ్శబ్దంలో అతని గుండె చప్పుడు వినిపిస్తోంది.

"నాన్నా."

"తలుపెయ్."

తలుపు మూశాడు సృజన్.

రేణుక కంగారుగా లేచి వస్తోంది.

"నాన్నా."

"సృజీ."

"ఏమిటిలా ఉన్నారు."

ఇప్పుడు రవి ఆకారం పూర్తిగా భిన్నంగా ఉంది. నున్నటి గుండు. లాల్చీ .... పంచె .... అదో తరహాలో ఉన్నాడు. ప్రత్యేకించి చూస్తే నే గాని గుర్తుపట్టడం కష్టం.

"ఇది వేషం. ఆ వివరాలు తర్వాత చెబుతాను. నీ స్టడీస్ ఎలా ఉన్నాయి?"

"నిజం చెప్పాలంటే ఐ డోంట్ లైక్" అన్నాడు సృజన్.

"ఏమిటది?"

"చదువుకోవటం."

"అదేమిటి?"

"చదువుకొని ఏం చెయ్యాలి? ఎవడిస్తాడు ఉద్యోగం. ఐ డోంట్ లైక్ దిస్ బ్లడీ యెడ్యుకేషన్. గుమస్తా గాళ్ళను తయారు చేస్తుందిది."

"అఫ్ కోర్స్.... చదువును తిట్టకు."

"ఇంటికి రాగానే మొదలా. ముందు స్నానం చేసి రండి. ఈలోపు నేను వంట చేస్తాను."

"అలాగే" స్నానాల గదిలోకి నడిచాడు. స్నానం చేసి వచ్చాక కుర్చీలో కూర్చుని—

"యస్. మెడియర్ సన్" అన్నాడు రవి.

"మీరు కనిపించి చాలా రోజులయింది."

"అవును."

కొంచెం సేపు నిశ్శబ్దం.

"మీరు తయారు చేస్తున్న నాటు బాంబులు ధర్మారావ్ మీద విసరారా?" చాలా మెల్లగా అడిగాడు.

ప్రక్కనే బాంబు పడినట్లు ఉలిక్కిపడ్డాడు రవి.

"సుజీ...."

"అది నా అనుమానం అంతే."

"వెల్, ఆ దాడి గురించి నీ అభిప్రాయం యేమిటి?"

"సాహసం....గొప్ప సాహసం."

"అంతేనా?"

"నాకనిపించింది అదే."

"కానీ ఆ దాడి సాహసంకోసమో, సరదాకోసమో కాదు. ప్రజలకోసం....విప్లవం కోసం."

"కానీ ...."

"అదో మార్గం. మేం ఎన్నుకున్నాం. అది చాలా కష్టతరమే. యేదో రోజున నేనూ పోవచ్చు. కాని విప్లవం అనగాను ఒక్కటే గుర్తుంచుకో. ఈ దేశంలో ప్రజలందరూ సుఖంగా బ్రతకాలి. ఆ క్షణం కోసమే మా ఆరాటం."

"ఆ దాడిలో కొన్ని లక్షలు దోచుకోబడ్డాయని అంటున్నారు."

"ఆ లెక్కలు నాకు తెలియవు. ఉద్యమం బలపడాలంటే డబ్బు అవసరం."

"అందుకోసం బందిపోటు దొంగల్లా దోచుకోవటమా?"

"బందిపోట్లు వారికోసం చేస్తారు. మేం ప్రజలకోసం చేశాం. వాడి దగ్గరున్న నోట్లన్నీ తగలేశాం. ఆ గ్రామంలో ఎవరూ వాడికి బాకీలేరు. వారందరికీ స్వేచ్ఛ లభించింది. వాడి ఆధీనంలో ఉన్న పొలాలు ప్రజల స్వంతం అయ్యాయి. మా దాడిమూలంగా ఓ గ్రామం విముక్తి చెందింది. ఇలా ఒక్కో గ్రామాన్ని విముక్తి

చేస్తాం. ఈ దేశంలో విప్లవం విజయవంతమవుతుంది. ఆ రోజున కార్మికులూ, కర్షకులూ గర్వంగా బ్రతుకుతారు. అదే మా ఆశయం."

సృజన్ మాట్లాడలేదు.

"ఏది యేమయినా నువ్వు చదువు మానొద్దు. అమ్మకు డబ్బు ఇస్తున్నాను. మీకు యెటువంటి అవసరం కలిగినా నా మిత్రుల అడ్రసులిస్తున్నాను. వాళ్ళని కలుసుకుంటే మీకు సహాయం లభిస్తుంది. మైడియర్ సన్. మిమ్మల్ని వదిలి వెళ్ళాలని నాకనిపించటంలేదు. కానీ నా బాధ్యత నన్ను తట్టి లేపుతుంది."

"నాన్నగారూ, మీరనుసరిస్తున్న పద్ధతుల గురించి నాకు తెలియకపోయినా మిమ్మల్ని చూస్తుంటే నాకు గర్వంగా వుంది."

"భోజనానికి రండి" రేణుక పిలుస్తోంది.

"అందరం భోంచేద్దాం."

"మేం భోంచేశాం."

"ఫర్వాలేదు."

రవి ముద్దలు కలిపి తినిపించాడు. సృజన్‌కూ, రేణుకకూ. రేణుకకు తెలియకుండానే కన్నీళ్ళు కారిపోతున్నాయి.

"కన్నీళ్ళా."

"కాదు. ఇలానే ఉండిపోతే బాగుండుననిపిస్తోంది."

"ఆ రోజుకోసమే మా పోరాటం."

ఆ తర్వాత యెవరూ మాట్లాడలేదు. భోజనం పూర్తయింది. రేణుకతో కొంతసేపు యేకాంతంగా మాట్లాడాడు రవి. పన్నెండు గంటలు దాటిపోయింది.

"మరి నేను వెళ్ళి వస్తాను."

"సుజ్జీ" పిలిచాడు.

"నాన్నా."

ఆప్యాయంగా నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

"గుడ్ బై మై సన్."

"గుడ్ బై."

"వెళ్ళొస్తాను. రేణుకా."

తల ఊపింది.

తలుపు తెరుచుకుంది. ఒక్క నిమిషం. చీకట్లో కలిసి పోయాడు. భయంకరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. సృజన్‌కు తండ్రితో జరిగిన సంభాషణ గుర్తొస్తుంది. మూసిన తలుపులకు చేరగిలబడ్డ రేణుక శూన్యంలోకి చూస్తోంది. సృజన్ మంచం దగ్గరికి చేరి కూర్చున్నాడు. రేణుక భారంగా నడుచుకుంటూ వచ్చి పడుకుంది.

తలుపుమీద దడ, దడ శబ్దం వస్తోంది.

ఉలిక్కిపడి లేచి వెళ్ళాడు.

తలుపుతీశాడు.

ఎదురుగా...

భుజానికి వ్రేలాడుతున్న తుపాకి .... దాని చివర బాయినెట్ మెరుస్తూ కనపడింది. ఆ తర్వాత ఎర్ర టోపి కనపడింది.

"పోలీసులు."

తనకు తెలియకుండానే వచ్చాయా మాటలు.

అరగంట తర్వాత....

సృజన్ కళ్ళు ఆగ్రహంతో మండిపోతున్నాయి. ఇల్లంతా చిందర వందరగా ఉంది. అన్ని వస్తువులూ చెల్లా చెదురుగా పడివున్నాయి. పగిలిన సీసాలు, జాడీలు వెక్కిరిస్తున్నాయి. పోలీసులు 'రవి' ఆచూకి చెప్పమంటూ బలవంతం చేశారు. యింట్లో సామానంతా

ధ్వంసంచేశారు. కారం .... ఉప్పు .... పచ్చళ్ళు....అన్నీ కుప్పలా పోశారు. మూలన ఉన్న పెట్టెను ఓ తాపు తన్నాడు. మూత ఎగిరిపోయింది.

అన్ని పుస్తకాలు! వాటిని స్వాధీనం చేసుకున్నారు.

"రవి ఎక్కడ?"

"ఏమో మాకు తెలియదు. ఆయన్ని చూసి చాలా కాలమయింది."

"ఇంకా వివరాలు దొరుకుతాయేమో చూద్దాం" అన్నాడో పోలీసు.

టేబుల్ మీద రేడియో గాల్లోకి లేచి రెండు ముక్కలయింది.

కుర్చీలూ.... టేబుల్ అంతా ధ్వంసం.

సృజన్ పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి.

ఎక్కడో చిల్లర డబ్బులు....నాలుగు పదులూ దొరికాయి. వాటిని జేబులో వేసుకున్నారు.

"జాగ్రత్త మళ్ళా వస్తాం. మీరు చెప్పకపోతే దొరకడా....పిట్టను కాల్చినట్టు కాలుస్తాం."

హెచ్చరించి వెళ్ళిపోయారు.

ఇంటి నడుమ నిలబడి ఉన్నాడు సృజన్.

వాళ్ళు ధ్వసంచేస్తుంటే తనెందుకలా రాతిబొమ్మలా ఉన్నాడో అర్థం కావటంలేదు. ఆమెకు ఒకటే మాట చెవుల్లో మారు మ్రోగుతోంది.

"పిట్టను కాల్చినట్లు కాలుస్తాం."

దాదాపు ఇంటిలోని సామానంతా ధ్వంసం కాబడింది. రవి అంతకుముందు ఇచ్చిన డబ్బు బొడ్లో దాచుకుంది కాబట్టి సరిపోయింది. లేకుంటే అవి సైతం తీసుకుపోయేవారే. ఆమెకు ఏం చేయాలో అర్థం కావటంలేదు.

ఇలా పదే పదే వాళ్ళు రావటం జరిగితే....ఆ తర్వాత రోజులెలా గడపాలనే సమస్య ఉదయించింది....

"మానవత్వం ఎలుక కంటే కరువు. పిల్లి కుంటుంది కనుకనా."

రవి మాటలే ఆమెకు గుర్తొస్తున్నాయి.

తర్వాత రెండు రోజులకే బాకీలన్నీ కట్టేసి వేరే చోటికి వెళ్ళిపోయారు. వెళ్ళేముందు రేణుక యింటి ఓనర్‌కు చెప్పింది.

"ఓ వేళ ఆయన రావటం జరిగితే మా విషయం చెప్పండి. ఇంకెవరు అడిగినా దయచేసి చెప్పొద్దు."

ఆ ఇల్లు ఖాళీచేసి బయటపడ్డాక, వున్న డబ్బుతోనే జీవించటం ప్రారంభించారు. దాదాపు రెండు నెలలు గడిచిపోయాయి. ఈ లోపు రెండుసార్లు సృజన్ పాత ఇంటికి వెళ్ళి వచ్చాడు. 'రవి' రాలేదని చెప్పారు.

ముఖ్యంగా అడవి ప్రాంతాలన్నీ కల్లోలంగా మారి పోయాయి. యెక్కడో చోట భూస్వామి హత్య చేయ బడ్డాడనో బాంబులు ప్రేలాయనో వార్తలు వస్తు న్నాయి. పోలీసు నిఘా తీవ్రతరమయింది. వారి రహ స్యాలకోసం ఎందరో అమాయకుల్ని బలిపెడుతున్నారు.

రవి జాడ మాత్రం తెలియలేదు.

6

రవి ఇచ్చిన డబ్బు అయిపోయింది. ఏం చేయాలో అర్థం కావటంలేదు. సృజన్ కాలేజీకి వెళ్ళటం మానే శాడు. పోలీసులు ఇంటికి వచ్చిన నాటినుండి అతనిలో అంతులేని మార్పు వచ్చింది. ప్రతిక్షణం దేన్ని గురించో ఆలోచిస్తున్నట్లు కనపడతాడు. గడ్డం బాగా పెరిగిపో యింది. అలాంటి స్థితిలో కొడుకును చూసినా ఆమెకు

సృజన్‌లో యేదో వెలుగు కనబడుతోంది. ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి అడుగు పెడుతున్నాడు సృజన్. ముఖంలో లేతదనం ఇంకా పోలేదు.

మెరుస్తున్న కళ్ళు, కొనదేరిన నాసిక, నొక్కుల జుత్తు యెంతో అందంగా కనిపిస్తాడు. కానీ సృజన్ జీవితం యెలా ఉంటుందో అర్ధం కావటంలేదు.

రేణుకకు రవి వెళ్ళే రోజు అతని మిత్రుల గురించి చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది.

సృజన్‌కు వారి అడ్రసులిచ్చింది. వారిలో యెవరి నయినా కలుసుకొని నాన్నగారి గురించి కనుక్కొని, పరిస్థితి చెప్పి, డబ్బేమయినా యిస్తే తీసుకురా అని పంపింది.

అడ్రసులు తీసుకొని బయలుదేరాడు సృజన్. ఆ అడ్రసు తాలూకు ఇంటిముందు ఆగాడు. అదో పెద్ద భవనం. దాన్ని చూడగానే ఆశ్చర్యపోయాడు. నాన్నకిలాంటి స్నేహితులున్నారా అనుకున్నాడు.

"క్యాహోనా" ఘూర్కా అన్నాడు.

"రాజారావు గార్ని కలుసుకోవాలి."

"నీ పేరు."

"సృజన్."

"ఠైరో. కనుక్కొస్తా."

"రవిగారబ్బాయని చెప్పు."

అతను లోనికెళ్ళాడు.

ఆ భవనం తాలూకు అందాలు చూస్తుండిపోయాడు.

ఘూర్కా వచ్చి...."అందర్ జావ్" అన్నాడు.

లోనికి అడుగుపెట్టాడు. ముఖద్వారం దాటేక పైకి పోటానికి మెట్లున్నాయి. మెట్లకు కుడిప్రక్కగా ఓ గది

ఉంది. దానిలోనుండే శబ్దాలు వస్తున్నాయి. అటువైపు నడిచాడు. తలుపు వేసివుంది. తట్టాడు సంశయంగానే.

"రా" గంభీరంగా వినిపించింది.

లోనికి అడుగు వేశాడు సృజన్—తలుపు తెరుచుకొని.

"నువ్వు రవి కొడుకువేనా?" ఒకాయన అడిగాడు.

తలూపాడు.

"ఏమిటి?"

"నాన్న గురించి తెలుసుకుందామని."

"మీ నాన్న గురించి మాకేం తెలుస్తుంది."

"నాన్న మీ అడ్రసిచ్చారు."

"ఎందుకు?"

"ఏమైనా అవసరమైతే కలుసుకొమ్మని."

"ఏ అవసరం?"

సృజన్‌కు విసుగేసింది. వాళ్ళలో ఓ రకమైన నిర్లక్ష్యం కనిపిస్తోంది. వీరితో తన తండ్రికి ఏ రకమైన స్నేహం ఉందో తెలియటంలేదు. ఆ భావాల్ని తన ముఖంలో కనపడకుండా జాగ్రత్తపడ్డాడు.

"కొంచెం డబ్బు కావాలి."

అతను ఒక్కసారిగా అసహ్యంగా చూశాడు. ప్రక్కన ఇంకా ఇద్దరున్నారు. ఇందాకటినుండి వారు మెల్లగా గ్లాసులో ఉన్న మందు త్రాగుతూ వింటున్నారు. వారి కళ్ళు కూడా సృజన్ వంక యేహ్య భావంతో చూస్తున్నాయి.

అతను జేబునుండి రెండు వంద కాయితాలు తీసి ఇచ్చాడు.

సృజన్ అందుకున్నాడు.

"ఇంకెప్పుడూ ఇలా రాకు" కంగున మ్రోగింది అతని

కంఠం....

సృజన్ కు అంతులేని అవమానమనిపించింది.

"మీ నాన్న ఇంకెవర్ని కలవమన్నాడు."

"రమణ....రఘు."

"వాళ్ళిక్కడే ఉన్నారు. వాళ్ళింటికి కూడా వెళ్ళకు. యేదో పని చేసి బ్రతకటం నేర్చుకో. మీ బాబు కెటూ బ్రతకటం చేతకాదు" అన్నాడు.

సృజన్ తీక్షణంగా చూశాడు అతనివంక.

"నువ్వు వెళ్ళవచ్చు."

ఆ కాయితాలు విసిరి ఆయన మొఖంమీద కొడదా మనుకున్నాడు. బలవంతాన నిగ్రహించుకున్నాడు.

గిరుక్కున వెనక్కి తిరిగాడు.

గ్లాసుల శబ్దంతో పాటు తిడుతున్న శబ్దాలు వినిపిస్తూనే వున్నాయి.

కోపంగా వచ్చిన బిడ్డను చూసి అడిగింది రేణుక.

"బాబూ, వెళ్ళి వచ్చావా?"

"వెళ్లాను."

"నాన్నగారు...." ఆగిపోయిందామె.

"ఆయన సంగతి తెలియదు కానీ ఇంకోటి చూశాను."

"ఏం చూశావ్."

"విప్లవాన్ని."

"బాబూ."

"అవును, ఖచ్చితంగా విప్లవాన్నే. మందు విప్లవాన్ని."

"నువ్వు మాట్లాడేదేమిటో నాకర్థం కావటంలేదు."

సృజన్ తమాయించుకున్నాడు.

"ఇవిగో ఇవిచ్చి, మరెప్పుడూ రావద్దని చెప్పారు."

రెండువందలిచ్చాడు.

వాటివంక అయోమయంగా చూసింది రేణుక.

"పని చేసి బ్రతకటం నేర్చుకొమ్మన్నారు."

"బాబూ" రేణుక గొంతులో అపశ్రుతి.

"బాధపడకమ్మా వాళ్ళు నిజం చెప్పారు. నేనుండగా యెవరో డబ్బు అడుక్కోవటం నేరంకదూ. నాకు ఒకటే విషయం అర్థం కావటంలేదు. కనీసం సానుభూతి లేకుండా మాట్లాడారు. వారితో నాన్నకుగల సంబంధం ఏమిటి?"

"ఏమో నాకు తెలియదు బాబూ."

7

సృజన్ గుండెలు బిగబట్టుకొని ఆ వార్త చదువుతున్నాడు.

విప్లవకారుల అరెస్టు!

"నిన్న పోలీసులు అకస్మాత్తుగా జరిపిన దాడివల్ల విప్లవకారులుగా చెప్పబడుతున్న కొందరు దొరికిపోయారు. వారంతా తమ రహస్య స్థావరంలో నాటు బాంబులూ, తుపాకులు తయారు చేస్తుండగా పట్టుబడిపోయారు. పట్టుబడిన వారిలో రవి అనే ప్రముఖ విప్లవకారుడు....అతని అనుచరులు ఉన్నారు. వీరిలో లోగడ ధర్మారావ్ అనబడే భూస్వామి హత్యలోనూ, మరికొన్ని దోపిడీలతో, హత్యల్తో సంబంధం ఉందని తెలుస్తోంది. వీరికోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. తుదకు వారిని నేడు పట్టుకోవటం జరిగింది."

సృజన్‌కు నోటివెంట మాటరావటంలేదు.

మెల్లగా లేచి ఇంటివైపుకు నడిచాడు. ఈ విషయం తల్లితో చెప్పాడు. అంతే ఆమె ఒక్కసారిగా విరుచుకు

పడిపోయింది. సృజన్‌కు ఏం చేయాలో అర్థంకాలేదు. కంగారుగా నీళ్ళు తీసుకొచ్చి తల్లి మొఖంమీద చల్లాడు. ఆమె తేరుకుంది. ఆ వార్తను 'అసాంతం' చదివి రోదించటం మొదలుపెట్టింది.

"అమ్మా, యేడవకు" సృజన్ వెక్కుతూ అన్నాడు.

"నీకు తెలియదు బాబూ. ఇంక మీ నాన్న మనకు దక్కడు."

"అమ్మా."

"అవునురా. ఆ రోజు పోలీసులేమన్నారు. పిట్టను కాల్చినట్లు కాలుస్తానన్నారు. గుర్తుందా?"

"అమ్మా."

"బాబూ.... వెంటనే వెళ్ళు.... ఆ రాజారావుగారితో మాట్లాడిరా. నాన్నగారిని ఎలా అయినా విడిపించమని చెప్పు. వాళ్ళ కాళ్ళు పట్టుకో. వెళ్ళిరా" ఏడుస్తోంది.

"అమ్మా" సంశయంగా అన్నాడు.

"వెళ్ళు బాబు. త్వరగా వెళ్ళు."

సృజన్ ఇంక ఏం ఆలోచించలేదు.

రాజారావు బిల్డింగ్స్ ముందు ఘూర్ఖా హైరో.... హైరో అంటూ అరుస్తున్నాడు. సృజన్ కవేం వినిపించటంలేదు. రాజారావు యేవో కాయితాలు చూసుకుంటున్నాడు.

"సార్!"

"ఎవరు?" అంటూ చూశాడు.

"ఏమిటి?" కఠినంగా అన్నాడు.

"సార్, మా నాన్నను పోలీసులు పట్టుకున్నారు."

"అయితే."

"నాన్నని మీరు కాపాడాలి!"

"అది నావల్ల ఎలా అవుతుంది?"

"సార్ మీరు తలుచుకుంటే చెయ్యగలరు. సార్ మా నాన్న లేకపోతే మా అమ్మ చచ్చిపోతుందండి. మీరెలాగయినా సాయం చేయాలి" సృజన్ కంఠంలో యేడుపుజీర.

"నేనేం చెయ్యగలనయ్యా" ఆయన కంఠంలో చాలా స్పష్టంగా విసుగూ, కోపం వ్యక్తం అవుతున్నాయి. బయట ఘూర్ఖా లోపలకు రావాలా, వద్దా అ నేది తేల్చుకోలేక చేతులు నలుపుకుంటున్నాడు.

సృజన్ అమాంతం ఆయన కాళ్ళమీద పడ్డాడు.

"మీరెలా అయినా నాన్నని రక్షించండి."

భోరున యేడుస్తున్నాడు.

"లే.... లే" దాదాపు అరిచాడు.

"చూడు బాబు. మీ నాన్నమీద ఖూనీ కేసులున్నాయి. నాటు బాంబులు తయారు చేస్తున్నాడనీ ఆరోపణలున్నాయి. కాబట్టి మేం చేయగలిగిందేం లేదు. మీ నాన్న నిర్దోషయితే ప్రభుత్వంవారే వదిలేస్తారు. వెళ్ళు."

"సార్!"

"గెటవుట్ బడ్డీ....ఇదివరకోసారి చెప్పాను. ఈ ఇంటి ఛాయలకు రావద్దని. మీ బాబుతోపాటు మమ్మల్నికూడా ఇరుక్కోమంటావా? ఇదేమన్నా క్రిమినల్ కేసా? వాళ్ళంతా విప్లవకారులు. యేమైనా మాట్లాడితే అందర్నీ తోస్తారు. దిసీజ్ ది లాస్ట్ వార్నింగ్. ఇంకెప్పుడూ ఇలా రాకు. దేఖో సింగ్ డోంట్ ఎలౌ దిస్ ఫెలో ...గెటవుట్" అరిచాడు కోపంగా.

సృజన్ నిరుత్తరుడయ్యాడు.

ఓ క్షణం చూశాక.

"సింగ్" అరిచాడు రాజారావు.

"అవసరంలేదు."

సృజన్ బయటకు నడిచాడు.

రఘు ...రమణలనుండికూడా అదే విధమైన రెస్పాన్స్. వారి కళ్ళల్లో ప్రతిబింబించిన అసహ్యాన్ని జీవితంలో తొలిసారిగా చూస్తుండిపోయాడు. మనుషుల్లో ఉన్న వివిధ రకాల ప్రవృత్తుల్ని అర్థం చేసుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. తనకు తెలియకుండానే మంచు హస్తమేదో గుండెల్ని ప్రాకుతోంది.

సృజన్ హృదయం కరడుగట్టుకుపోతోంది!

నిరాశగా ఇంటికి తిరిగి వచ్చాడు. కళ్ళల్లో వత్తులు వేసుకు చూస్తున్న అమ్మ ముఖం పాలిపోయి వుంది. శవాన్ని గోడకు నిలబెట్టినట్లుంది. నిస్తేజమైన ఆ కళ్ళలో ఎక్కడో చిగురంత ఆశ తళుక్కుమంటోంది.

"బాబూ."

సృజన్ ఓసారి తల్లివంక చూసి తలక్రిందకు దించుకున్నాడు.

"ఏమన్నారు?"

"నాకు ముందే నమ్మకంలేదు. నీ మాట కాదనలేక వెళ్ళాను."

"అఁ" ఒక్కసారిగా భరించలేనంతగా నిరాశ, నిస్పృహాలు గుండెల్ని ఆవరించగా ఆమె చేత్తో గుండెల్ని రాసుకుంటూ కూలిపోయింది.

"అమ్మా" అంటూ ఆర్తనాదం చేశాడు సృజన్.

8

ఎదురు కాల్పుల్లో మరణం!

"నిన్న అరెస్టు చేయబడ్డ విప్లవకారుల్ని రాజధానికి

తరలిస్తున్న సందర్భంలో పారిపోవటానికి విఫలయత్నం జరిగింది. ప్రముఖ విప్లవకారుడు రవి, తన అనుచరులతో పోలీసుల దగ్గర తుపాకి లాక్కొని అడవుల్లోకి పరిగెత్తబోగా పోలీసు బలగం వెంటాడింది. ఆ సందర్భంగా ఇరుపక్షాలనుండి తీవ్రమైన పోరాటం జరిగింది. ఆ పోరాటంలో ఇరువురు పోలీసులు గాయపడ్డారు. రవి అతని అనుచరులు ఈ కాల్పుల్లో మరణించారు....”

పేపరులోని వార్త చదవటం పూర్తయింది. అయినా సృజన్‌లో యెలాంటి కదలిక లేదు. అతని కళ్ళవెంట నీళ్ళు రావటంలేదు. ఆ వార్తలోని సత్యాసత్యాలను గురించి అతను ఆలోచించటంలేదు. నిన్నటినుండి “కోమా”లో వుండిపోయిన తల్లివంక చూస్తున్నాడు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మూలగా పడుకున్న ఆమెను చూస్తున్నాడు. ఆమెకింతవరకు బెడ్ లభించనే లేదు. అక్కడి డాక్టర్లు, నర్సులూ, సిబ్బంది మూర్తీభవించిన నిర్లక్ష్యానికి ప్రతీకగా వున్నారు.

వారిని సంతృప్తిపరచటానికి సృజన్ దగ్గర డబ్బు లేదు.

డాక్టరొకాయన తన వార్డునుండి నడిచి వస్తున్నాడు.

“సార్ .... సార్” సృజన్ అతనివెంట ప్రాధేయపడూ అడుగుతున్నాడు.

ఆయన ఆగి ఓ క్షణం సృజన్‌వంక చూశాడు.

సృజన్ని చూడగానే నిర్లక్ష్యంగా వెళ్ళలేక పోయాడు.

“యస్” అన్నాడాయన ప్రశ్నార్థకంగా.

“నా మదర్ నిన్నటినుండి స్పృహ లేకుండాపడుంది. ఇంతవరకూ బెడ్ యివ్వలేదు. అసలు యెవరూ పలకటం

లేదు. ఓసారి చూస్తారా" ఆశగా అడిగాను.

ఆయన రేణుక దగ్గరకు నడిచాడు.

నాడిపట్టుకు చూశాను.

కంగారుగా స్టెతస్కోప్ తగిలించుకొని గుండెలమీద ఉంచాడు.

ఒకసారి నిట్టూర్చాడు.

సృజన్ కంగారుగా చూస్తున్నాడు.

"ఐయామ్ వెరీ సారీ" అన్నాడు.

సృజన్ కళ్ళు నిర్లిప్తంగా చూస్తున్నాయి.

"షి ఈజ్ డెడ్."

సృజన్ బిగుసుకు పోయాడు.

డాక్టర్ భుజం తట్టాడు.

"ఆమెను పోస్టుమార్టం చేశాక సాయంకాలం శవం అప్పగిస్తారు."

సృజన్ నవ్వాడు.

"దేనికి సార్. ప్రతిక్షణం ఛస్తూ బ్రతుకుతున్నవారు చచ్చాక పోస్టుమార్టమ్ అంటూ శవాన్ని కోస్తారెందుకు సార్. ఆమె గుండె కోత యెప్పుడో మొదలయింది. ఈ రోజు మీరు కోయాల్సిన పనిలేదు డాక్టర్. కానీ డాక్టర్ ఇక్కడకు వచ్చేది మనుషులే డాక్టర్. ఈ నర్సులు.... ఈ డాక్టర్లు .... యిక్కడ సిబ్బంది వాళ్ళకి గుండెలు న్నాయా? ముందా విషయం పోస్టుమార్టం చేసి కనుక్కోండి. ఇక్కడకు వచ్చేవాళ్ళకు మందులివ్వకపోయినా కనీసం చల్లని మాటయినా మిగల్చండి సార్."

ఆయనకు ఏం మాట్లాడాలో తెలియలేదు.

"ఐయాం సారీ" అని మాత్రం అన్నాడు.

"ఇక్కడ మిమ్మల్నొక్కర్నే చూశాను. మీకు గుండె

ఉందనిపిస్తోంది. సార్ నాకు హెల్ప్ చెయ్యగలరా? నా గుండెను తొలగించండి. జాలి, మమత, మానవత్వం ఇవేవీ ఈ గుండెను చేరనీయకుండా ఆపరేట్ చెయ్యండి సార్" సృజన్ స్వరంలోని తీక్షణతకు అతను దిగ్భ్రమ చెందాడు.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్."

భుజంతట్టి వెళ్ళిపోయాడాయన.

సృజన్ తల్లి వంక చూశాడు.

నిశ్చలంగా నిద్రపోతున్నట్లుంది ఆమె.

ఆమె మీదికి వాలిపోయాడు.

ఎవరో తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది.

ఎదురుగా "స్ట్రెచ్చర్" వుంది.

దానిమీద రేణుకను తీసుకెళ్ళిపోయారు.

శవాల గదిలో రేణుక శవం ఉంది.

ఆ శవాన్ని బయటికు తెచ్చి దహనం చెయ్యాలి. ఎలా?

ఇంట్లో మిగిలిన సామానంతా మూటకట్టుకొని మార్కెట్ కెళ్లాడు సృజన్. మొత్తం లెక్కకట్టి వంద రూపాయలు ఇస్తానన్నాడు మార్వాడీ. మనిషి అవసరాన్ని మరో మనిషి ఎలా ఉపయోగించుకుంటాడో అర్థమయింది.

డబ్బు తీసుకున్నాడు.

ఇంటికి చెందినాయన నలుగుర్ని తీసుకొచ్చాడు.

వాళ్ళు శవాన్ని ఎత్తుకున్నారు.

స్మశానంలో తీసుకెళ్ళి దించారు.

కొరివి చేత్తో అందుకున్నాడు.

"అమ్మా....ఇన్ని సంవత్సరాలు నన్ను నీ కళ్ళలో

పెట్టుకు సాగావు. నాకోసం కన్నీరు కార్చావు. నాకోసం ఆరాటపడ్డావు. కానీ ఈ రోజున నీకు నిప్పు అంటి స్తున్నాను. అమ్మా ఒక్క విషయంలోనే నువ్వు అదృష్ట వంతురాలివి.... నాన్న పోయాడనే వార్త నీ గుండెల్ని బద్దలు చేయకముందే వెళ్ళిపోయావు. నన్ను మాత్రం మిగిల్చావు."

"అంటించు బాబు" అంటున్నా రెవరో.

కొరివి అంటించాడు.

గుప్పున ఎగిశాయి మంటలు.

సృజన్ ఈ లోకంలో లేడు.

అతని ముఖంలో యే భావాలూ కనపడటంలేదు.

నాలుకలు చాచుకొని మండుతున్న ఆ మంటలు సృజన్ హృదయంలోని మిగిలివున్న మానవత్వపు ఛాయల్ని దహించి వేస్తున్నాయి.

అలా ఎంతసేపున్నాడో తెలియదు.

ఎవరూ లేరు. అందరూ వెళ్ళిపోయారు.

ఆకాశంలో చందమామ వెలుగులు విరజిమ్ముతోంది.

స్మశానంలో తినొక్కడు మిగిలాడు.

బూడిదగా మారిన 'అమ్మ' వుంది.

9

"ఇంకా పడుకోలా" అన్నం పెట్టినతను అంటు న్నాడు.

ఉలిక్కిపడ్డాడు సృజన్.

"చల్లంగా వుంది. పడుకోరాదూ."

సృజన్కు చల్లదనం అనుభూతి కలగటంలేదు.

శరీరం మహా వేడిగా వుంది.

కళ్ళు మూసుకున్నాడు. నిద్ర పట్టేసింది.

సూర్యకిరణాలు మొఖంమీద పడుతుంటే బద్ధకంగా లేచాడు. దాదాపు తొమ్మిదిగంటలవుతోంది. లేచి ఓ పుల్ల విరుచుకొని పళ్ళు తోముతూ వెళ్ళాడు. పైపు దగ్గరకు వెళ్ళి మొఖం కడుక్కున్నాక కొంచెం రిలీఫ్ ఫీలయ్యాడు. ప్రపంచమంతా ప్రశాంతంగా వున్నట్లనిపించింది.

మెల్లగా నడవటం ప్రారంభించాడు.

తన ప్రక్కనుండి ఓ కారు దూసుకుపోయింది.

సృజన్ నిర్లక్ష్యంగా నడుస్తున్నాడు.

వెంటనే ఆ కారు రివర్స్ అయి వచ్చింది.

డ్రైవింగ్ సీట్లో ఒకాయన కూర్చుని వున్నాడు.

అక్కడినుండే వంగి డోర్ తెరిచి "గెటిన్" అన్నాడు.

సృజన్ లిప్తపాటు శంకించాడు.

మరుక్షణం కారు యెక్కటం, తలుపులు మూసుకోవటం.... కారు కదలటం ఒక్కసారే జరిగాయి.

సరాసరి కారు వెళ్ళి "సెలూన్" ముందు ఆగింది.

"దిగు."

సృజన్ దిగాడు.

"కమాన్."

లోనికి నడిచారు. సృజన్ వంక అదోలా చూస్తూ, సెలూన్ ప్రొప్రయిటర్ సాదరంగా ఆహ్వానించాడు.

"క్రాఫ్ చేయించు."

"స్పెషలా."

"యస్ నాకు షేవ్ చెయ్యి" అన్నాడాయన.

సృజన్ వెళ్ళి కూర్చున్నాడు. మెత్తటి కుషన్ ఛెయిర్

ఎయిర్ కండీషన్డ్ సెలూన్ అది. స్టీరియోలో హిందీ పాట వినపడుతోంది.

ఒకతను దగ్గరకొచ్చి "ఎలా చేయమంటారు" అనడిగాడు.

"రాజూ....నువ్వాగు" అన్నాడు ప్రొప్రయిటర్.

అతనే స్వయంగా వచ్చాడు. దాదాపు గంట టైము తీసుకున్నాడు. బాగా డ్రై చేసి, ముఖం నీళ్ళతో కడిగి పౌడర్ వేశాడు.

"తలంటుకున్నాక మళ్ళీ రండి డ్రై చేద్దాం" అన్నాడాయన.

"ఓ.కె. సార్. మీరు లేవొచ్చు."

వెంట్రుకలు కనపడకుండా శుభ్రంగా క్లీన్ చేశాడు.

సృజన్ 'అతని' ముందుకొచ్చి నిలబడ్డాడు.

ఆయన లేచి నిలబడుతూ షాపు ఓనర్ చేతిలో డబ్బు ఉంచటాన్ని గమనించాడు సృజన్.

తిరిగి కారులో ఎక్కారు.

ఈసారి వెళ్ళి పెద్ద రెడీమేడ్ షాపు ముందాగింది.

ఇద్దరూ దిగారు.

సృజన్ కొలతలు తీసుకోవటానికి ఓ మనిషి రావటం జరిగింది.

"అతను" గబగబ రాక్ అంతా పరిశీలించి నాలుగు జతలు సెలక్టు చేశాడు. ఓ పాకెట్ బనీన్లు మరో పాకెట్ డ్రాయర్లు తీసుకున్నాడు.

"అర్జెంటుగా ఈ కొలతలకు సరిపోయే జీన్స్ యివ్వండి. నెక్స్ట్ ఆ బట్టలు రెండు రోజుల్లో తయారు చేసి ఇవ్వండి" అన్నాడు.

"అలాగే సార్. సాయంకాలం ట్రయల్ ఇస్తాను."

"వెరీగుడ్" అన్నాడు వాలెట్ తెరుస్తూ.

సృజన్ కంతా ఆశ్చర్యంగా వుంది.

కొన్ని వందల కాయితాల్ని నిర్లక్ష్యంగా ఇచ్చాడు. పాకెట్లు తీసుకొని కారులో పడేశాక, గుర్తు వచ్చిన వాడిలా "కమాన్" అన్నాడు ప్రక్కనే ఉన్న షూ స్టోర్స్ లోకి నడుస్తూ.

రెండు మూడు రకాలు చూశాక లేటెస్టువి సెలక్టు చేశాడు.

నాలుగు జతల సాక్స్ తో సహా పాక్ చేయించాడు.

ఇద్దరూ కారెక్కారు. పెద్ద స్టార్ హోటల్ ముందు కారాగింది.

'బాయ్' వచ్చి పాకెట్స్ అందుకున్నాడు.

లిఫ్ట్ లో రూమ్ కెళ్లారు.

తాళంతీసి తలుపు నెట్టాడు.

కండిషన్ చేయబడ్డ చల్లటిగాలి మృదువుగా తాకింది.

లోనికి అడుగువేశాడు ఉక్కిరి బిక్కిరి అవుతూ.

"నువ్వు వెళ్ళి స్నానంచేసిరా" అన్నాడు బాత్ రూం చూపిస్తూ.

సృజన్ లోనికెళ్ళాడు. బాత్ రూం అద్దంలో తన మొఖం చూసుకొని ఆశ్చర్యపోయాడు. అప్పుడే తనలో అంతులేని మార్పు కనబడుతోంది.

అసలిదంతా ఆశ్చర్యంగా వుంది. ఆయన నెవరు? యెందు కిలా చేస్తున్నాడు? ఏం అర్థం కావటంలేదు. బాత్ టబ్ వుంది. దానిలో పడుకున్నాడు. చల్లగా నీరు తగులుతుంటే. అంతులేని ఆనందంగా వుంది. కొంచెంసేపు శరీరం నానాక ఉండలు ఉండలుగా మట్టి రావటం జరుగుతోంది.

ఎగ్ షాంపోతో తల శుభ్రంగా రుద్దేశాడు. శరీరమంతా తోమి తోమి స్నానం చేశాడు. క్రొత్త టవల్ స్టాండ్ మీదుంది. ఇప్పుడు శరీరం కాంతితో మెరుస్తోంది. తల తుడుచుకుంటూ బాత్ రూంలో నుండి బయటకు వచ్చాడు.

ఆయన సిగరెట్ కాలుస్తూ కూర్చుని వున్నాడు.

“డ్రెస్ చేసుకో” అన్నాడు.

పాకెట్స్ విప్పి డ్రెస్ చేసుకున్నాడు. జీన్స్ కరెక్టుగా సరిపోయాయి. అద్దంముందు నిలబడి చూసుకుని ఆశ్చర్యపోయాడు. తనింత అందంగా ఉంటాడనే విషయం మొదటిసారి తెలుసుకున్నాడు. జుట్టంతా చిక్కులు విడిపోయి, పాయలు పాయలుగా ఉండి హాయిని కలిగించింది. పౌడర్ తీసి లైట్ గా అద్దుకున్నాడు.

“కమాన్” అన్నాడాయన.

సర్వర్ అప్పుడే రెండు మీల్స్ తెచ్చి ముందుంచాడు.

“తిను.”

సృజన్ మాట్లాడకుండా తినటాని కుపక్రమించాడు. సృజన్ కిష్టమయిన నాన్ వెజిటేరియన్ ఫుడ్ అది. చాలా రుచిగా ఉంది. కడుపునిండా తినేశాడు. ఆ తర్వాత బోయ్ వచ్చి క్లీన్ చేశాడు.

సృజన్ కళ్ళు మూతలుపడుతున్నాయి.

“నిద్ర వస్తుందా?”

“అఁ లేదు. లేదు.”

“పర్వాలేదు. పడుకో.”

సృజన్ మాట్లాడకుండా వెళ్ళి బెడ్ మీద పడుకున్నాడు. మెత్తగా ఉందది.

ఆయన సిగార్ వెలిగించుకుంటూ ఓ స్విచ్ ఆన్ చేశాడు.

మెల్లగా సంగీతం మొదలయింది.

ఆ శబ్దాలు జో కొడుతుండగా సృజన్ నిద్రలోకి జారిపోయాడు.

సృజన్ లేచేటప్పటికి ఆయన యేవేవో కాయితాలు చూసుకుంటున్నాడు. సృజన్ లేచి బాత్ రూంలోకి వెళ్ళాడు. మొఖం కడుక్కుని వచ్చాడు. బట్టలు కొంచెం నలిగి వున్నాయి.

“సాయంకాలం నాలుగు లుంగీలు తెచ్చుకుందాం” అన్నాడు ఆయన సృజన్ని చూస్తూ. అంతకుముందే ఆర్డరిచ్చాడు కాబోలు లైట్ టిఫిన్, పొగలు క్రక్కుతున్న టీ వచ్చింది. అవి తీసుకున్నాక.

“బయటకు వెళదాం” అన్నాడు.

కారులో బయలుదేరారు. సృజన్ కారులోనుండి బయట ప్రపంచాన్ని చూస్తున్నాడు. నేటి జీవితానికి, నిన్నటి జీవితానికి నడుమ తేడాను గమనిస్తున్నాడు. ఇదంతా కలలా వుంది. కానీ అది కలకాదు. వాస్తవం. ఆ సంగతి సృజన్కు తెలుస్తూనే వుంది.

“ఏమిటి ఆలోచిస్తున్నావు.”

“ఏమీ లేదు. నిన్నటికీ నేటికీ తేడా గురించి.”

ఆయన నవ్వాడు.

“పెట్టుబడిదారీ ప్రపంచంలోని అద్భుతాలివి. ఇక్కడ ఏం జరిగినా అర్థరాత్రే జరుగుతుంటాయి.”

“కానీ నా జీవితంలో పట్టపగలే ఈ మార్పు జరిగింది. మీ కభ్యంతరం లేకుంటే మీ రెవరో నేను తెలుసుకోవచ్చా.”

"ఐయాం రాబర్ట్" అన్నాడు బ్రేక్ వేస్తూ.

అప్పుడు చూశాడు. పెద్ద థియేటర్ ప్రాంగణంలోకి వచ్చి ఆగింది కారు. ఇద్దరూ దిగారు. అందులో ఇంగ్లీషు సినిమా ఆడుతోంది. మార్షల్ ఆర్ట్సుకు చెందిన ఇంగ్లీషు సినిమా.

"ఎవరీ రాబర్టు" అనుకుంటూ లోనికి నడిచాడు.

ఆ చిత్రం నిండా కరాటే, కుంగ్ ఫూయొక్క ప్రాధాన్యత కనబడుతోంది. ఆ వ్యక్తుల కదలికల్లో వేగం, సమయస్ఫూర్తి. సృజన్ని విపరీతంగా ఆకర్షించాయి.

సినిమా వదిలాక హోటల్ కెళ్ళారు.

"డ్రెస్.... ఛేంజ్ చేసుకో....నువ్వు చూడాల్సిన వింతా ఉన్నాయ్."

రాబర్టు ఫారిన్ స్ప్రే చల్లుకున్నాక సృజన్ కందించాడు.

గదంతా పరిమళ భరితం అయింది.

రూమ్ లాక్ చేసి క్రిందకు నడిచారు.

10

ఓ మూలగా రిజర్వ్ చేయబడిన సీట్లలో ఇద్దరూ కూర్చున్నారు. "స్టీవార్టు" వచ్చాడు ఆర్డర్ బుక్ తీసుకొని.

"టు ఆమ్లెట్స్....చిప్స్....కూల్ డ్రింక్స్."

విచిత్రంగా వారివంక చూసి వెళ్ళిపోయాడు.

స్టేజిమీద ఆర్కెస్ట్రా వుంది. అత్యంత ఆధునికమైన ఇన్స్ట్రుమెంట్సున్నాయక్కడ. సంగీతం మొదలయింది. ఓ గాయకుడు పాడుతున్నాడు మధురంగా. అతని ప్రక్కన ఓ గాయని వుంది. ఆమె కొంచెం లావుగా వున్నా అందంగానే కనిపిస్తోంది. పైగా యుక్త వయ

సులో సైతం వున్నట్లనిపించుతుంది. ఆ పాట ఆగాక కేవలం ఆర్కెస్ట్రా మాత్రమే పనిచేయటం ఆరంభించింది. గిటార్ ధ్వనులు వింత అనుభూతిని కలిగిస్తున్నాయి.

లిఫ్ట్‌లో ఓ ఆర్టిస్టు వచ్చింది.

"మిస్ రీటా."

ఆర్కెస్ట్రా తీవ్రస్థాయి నందుకుంది.

డయాస్ మీద ఒక్కసారిగా ప్రత్యక్షమయింది.

"హాయ్" అరుస్తున్నారెవరో.

ఆమె అయిదు నిమిషాలు నర్తించి డయాస్ దిగింది. అందరి టేబుల్స్ వద్దకూ వచ్చి తన అంగాల్ని ప్రదర్శిస్తోంది.

ఇంతలోనే మరో నర్తకి, ఆ తర్వాత మరొకరు వచ్చి వరుసగా అందర్నీ విష్ చేయటానికొస్తున్నారు. వారు మృదువుగా తప్పించుకుంటూ వస్తున్నారు.

అందర్నీ విష్ చేశాక కార్యక్రమం మొదలయింది.

రీటా డ్యాన్స్ మొదలయింది. "ముజ్రా" డ్యాన్స్. ఖాన్ పాడుతున్నాడు. అనుగుణంగా అడుగులు వేస్తోంది. చూస్తున్న జనమంతా వెర్రెక్కిపోతున్నారు. వందలూ, యేభైలు వుండలు చుట్టి విసురుతున్నారు. అవేవీ ఆవిడ నిమగ్నతను చెడగొట్టడం లేదు.

సృజన్ కూర్చున్న టేబుల్ వెనుక అద్దం వుంది. దాని వెనక గది వుంది. అటువైపు యథాలాపంగా చూశాడు.

లోపలనుండి త్రాగుతూ మాస్తున్నారు ముగ్గురు. వారి నడుమ బికినీలో ఓ యువతి వుంది. ఆమె వారి నడుమ కూర్చుని ఇరువురి భుజాలమీద చేతులు వేసి గలగలమంటూ

మాట్లాడుతోంది.

ఆమె భుజంమీద చెయ్యి వేసింది రాజారావ్!

ఆ ప్రక్కన వున్నది "రమణ" "రఘు."

సృజన్ శరీరం సలసలా కాగసాగింది.

"కంట్రోల్ మై బోయ్" అన్నాడు రాబర్ట్ భుజం తడుతూ.

"ఆమ్లెట్ తిను."

సీరియస్‌గా ఆమ్లెట్ తినటం ప్రారంభించాడు. క్షణాల్లో అయిపోయింది. వెంటనే కూల్ డ్రింక్ త్రాగేశాడు. కళ్ళు ఎర్రగా వున్నాయి.

స్టేజివంక చూశాడు.

చివరి అంశం....మ్యూజిక్ తారస్థాయి నందుకుంది.

శరీరంమీద ఒక్కొక్కట్టా వలిచేస్తుంది.

ఎదురుగా కూర్చుని చూస్తున్న తల నెరిసిన మనిషి వుద్రేకంగా చూస్తున్నాడు. వారివంక చూస్తూ రెచ్చగొడుతోంది.

"వా, వా, వా" అరుస్తున్నాడు.

లైట్లు వెలుగుతూ ఆరిపోతున్నాయి.

ఆ వెలుగులో కనిపించీ కనిపించక తికమక పెడుతోంది. ఆమె గుండెలమీద ఏ ఆచ్ఛాదన లేదు. ఒక్క క్షణం లైట్లు ఆరిపోయి వెలిగాయి. ఆమె లేదు. అరుస్తున్న వారంతా కూర్చుని రొప్పుతున్నారు.

"వాడు ఛీఫ్ ఇంజనీరు. మరొకడికి బ్యాంకులో పెద్ద ఉద్యోగం. వాగందరినీ తీసుకొచ్చింది మాత్రం ఆ లావాటి కంట్రాక్టర్" రాబర్టు చెప్పాడు.

"కోబ్రా డ్యాన్స్ వుంది చూడు" అన్నాడు.

నిజంగానే దాదాపు పదడుగుల కోబ్రాను మీద

వేసుకొని నర్తిస్తుంది. ఆమె శరీరంమీద అది ప్రాకుతుంటే అది గగుర్పొడుస్తుంది.

సృజన్ యథాలాపంగా వెనక్కి చూశాడు.

అక్కడ ఎవరూ లేరు.

అంతలోనే స్టేజీమీద రగడ మొదలయింది. ఆ డ్యాన్సర్‌ను కౌగలించుకొని ముద్దుపెట్టుకోవాలని ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని అడ్డగించాడు ఓ లావాటి వ్యక్తి. అతన్ని ఊహించలేనంత వేగంతో కడుపులో పొడిచాడు. ఆ లావాటి వ్యక్తి కళ్ళు తిరిగి "అబ్బా" అంటూ మోకాళ్ళమీద కూలబడ్డాడు.

ఆ వ్యక్తి డ్యాన్సర్‌ను ఒక్క పెట్టున లాగాడు.

ఆమె విసురుగా వెళ్ళి కుర్చీకి కొట్టుకొని బాధగా అరిచింది.

సృజన్ విసురుగా లేచాడు. రాబర్టు వారించేలోగానే ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళిపోయాడు.

పిడికిలి బిగించి కడుపులో ధడేల్ మంటూ గుద్దాడు.

ఆ వ్యక్తి నోటివెంట మాటరాలేదు.

అదే వేగంతో "పెడీ" "పెడీ" గుద్దుతూనే వున్నాడు రాబర్టు వచ్చి ఆపేదాకా.

అతను వెనక్కి విరుచుకు పడిపోయాడు. మరుక్షణంలోనే వాంతి చేసుకున్నాడు.

"ఎవరతను, ఎవరతను" అంటున్నారెవరో.

"మనిషిని" అరిచాడు సృజన్.

కళ్ళు తెరిచిన డ్యాన్సర్ సృజన్ వంక కృతజ్ఞతతో చూసింది.

అప్పటికి లేచున్నాడు లావాటి వ్యక్తి.

కంగారుగా సృజన్ని రాబర్టు లాక్కుపోయాడు,

11

"ఏమిటి అంత ఆవేశపడ్డావు" అన్నాడు రాబర్టు.

"లేదు సార్. ఈ రోజే నేను మనిషినయ్యాను. ఇన్నాళ్ళు ఏం జరిగినా యేదో హాస్తం కట్టిపడవేసింది. యెన్నో అవమానాలు భరించాను" అన్నాడు చేతిని సవరించుకుంటూ.

"సృజన్. నే నెవరో అని ఇంతవరకు ఆలోచిస్తూ వున్నావు. ఆ సంగతి నాకు తెలుసు. కానీ నా ఆలోచనలు వేరుగా వున్నాయి. ఈ రోజు నిన్ను గమనించాక నాకు తృప్తి కలిగింది.

సృజన్....రవీ నేనూ స్నేహితులం. నాకు చాలా వ్యాపారాలున్నాయి. రవి రాజకీయాల్లోకి ప్రవేశించటంతో వాడి జీవితంలో గొప్ప మార్పు వచ్చింది. అనతి కాలంలోనే వాడు మరీ తీవ్ర వాదంలోకి జారిపోయాడు. ప్రజలు చేయాల్సిన పనిని తాను చేయటానికి నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలోనే నాకూ, వాడికీ అభిప్రాయ భేదాలొచ్చాయి.

నేను విప్లవానికి ద్రోహం చేస్తున్నానన్నాడు. వాడికి నాటుబాంబులూ, తుపాకులు తయారుచేయటంలో గొప్ప నేర్పు వుంది. రాను....రానూ రవి రహస్యంగా తన కార్యకలాపాల్ని సాగించటానికి పూనుకున్నాడు.

దాదాపు సంవత్సర కాలం నేను దేశంలో లేను. మా ఇద్దరిదీ ప్రాణస్నేహం. నేను దేశంలో లేని సమయంలోనే అంతా జరిగిపోయింది. నేను వచ్చాక స్వయంగా విచారించాను.

అత్యంత దారుణమైన విషయాలు వెలుగులోకి రావటం జరిగింది. మీ నాన్నతో పాటు మరికొంధరు

విప్లవకారులుగా బయలుదేరి అంతులేని ధనాన్ని చూడగానే తమ కార్యక్రమానికి స్వస్తి చెప్పారు. రవిని కూడా బయటకు రమ్మని కోరారు. అందుకు వాడు ససేమిరా అంగీకరించలేదు.

అసలు యే దోపిడీతోనూ....హత్యతోనూ వాడికి సంబంధంలేదు. లైసెన్సు లేకుండా బాంబులూ, తుపాకులు తయారుచేయటం ఒక్కటే వాడి నేరం. వ్యాపారం చేస్తూ ఉద్యమానికి సహాయం చేస్తానని కొందరు మాట ఇవ్వటం జరిగింది. ఆ తర్వాత వారు మారిపోయిన తీరు రవిని ఆశ్చర్యపరిచింది.

ధర్మారావ్‌ను హత్యచేయటంతో సమస్య పూర్తవుతుందనుకున్నారు. కానీ ఆయన పోయాక అతని కొడుకొచ్చాడు. ఊర్లో వారిలో కొందరు స్వచ్ఛందంగా నోట్లు రాసిచ్చారు. మరికొందరు బలవంతంగా రాసిచ్చారు.

తన ఉద్యమంవల్ల యేర్పడిన ఫలితాల్ని స్వయంగా గమనించాడు రవి. అయినా మనస్సు రాజీపడటానికి అంగీకరించలేదు. బయటనుండి ఉద్యమానికి సహకరిస్తానన్న వారి దగ్గరకు అంతులేని సంపదలు చేరాయి! ఎలా! ఉద్యమానికి సహకరిస్తున్నారనే పేరుతో వందలాదిమంది యువకుల్ని చిత్రహింసలు పెట్టారు. కాల్చి చంపారు.

రవి పశ్చాత్తాపపడ్డాడు. ప్రజలు కదలాల్సిన అవసరం గుర్తించనందుకు, వారి ప్రాముఖ్యం తగ్గించినందుకు బాధపడ్డాడు. తమ ఉద్యమం దారుణంగా దెబ్బతింది.

బయటనున్న తన సహచరుల దగ్గరకు పంపిన వారి నుండి విన్న వార్తలకు పూర్తిగా చలించిపోయాడు. వాళ్ళు విప్లవాన్ని యే రకంగానూ సమర్థించకపోగా,

అప్పుడప్పుడూ అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా నిలిపి వేశారు. ఇలా చీటికీ, మాటికీ రావటం మూలంగా తాముకూడా ఇరుక్కు పోగలమని చెప్పారు. రవి దెబ్బ తిన్న పక్షిలా గిలగిల లాడిపోయాడు.

పెళ్ళాం, బిడ్డల్ని, యవ్వనాన్ని త్యజించి కొండల్లో, కోనల్లో ఆశయంకోసం పనిచేస్తున్న వారుండగా, వారి ఆశయాల్ని డబ్బు చేసుకున్న వారిపట్ల ఆగ్రహంతో కదిలిపోయాడు. తమ వారందరినీ సమావేశపరిచి తమలోని నిజమైన శత్రువు నెదుర్కోవటానికి నిశ్చయించాడు. ఈ వార్త వారికి తెలిసిపోయింది.

దాడికి కావలసిన అమ్యూనిషన్ తయారుచేస్తుండగానే పోలీసులు వచ్చారు. అందర్నీ బంధించారు. రవిని, మరి కొందరు ముఖ్యమైన వారిని తీసుకెళ్ళి చెట్లకు కట్టి కాల్చి చంపారు. ఎదురు కాల్పుల్లో చనిపోయారని ప్రచారం చేశారు. తమకు అడ్డు తొలిగిపోయిందని సంబరపడ్డారు.

ఇదంతా జరిగిన తర్వాత నేను వచ్చాను. మీకోసం వెతికాను. అమ్మ చచ్చిపోయిందని, నువ్వు మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నావని చెప్పారు. రవి నీ గురించి తరచుగా చెబుతుండేవాడు. నీమీద ఆయన చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఈలోపే బలయిపోయాడు.

ఇది ఖచ్చితంగా ద్రోహం. తడిగుడ్డలతో గొంతులు కోయటం. "సృజన్" నీకు తెలియదు. రవి గొప్ప వ్యక్తి. అతని సిద్ధాంతాలతో నాకు విభేదాలుండవచ్చు. కానీ అతనిలోని పట్టుదల కార్యదీక్ష మాత్రం ఈ దేశానికి కావాలి."

సృజన్ కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి.

"మీపట్ల గర్వంతో కూడిన భావం నాలో కలుగు

తోంది సార్. ఒక్క కోరిక. మా నాన్నను పోలీసులు పట్టుకోవటానికి సహకరించింది ఎవరు?"

రాబర్టు సృజన్ కళ్ళలోకి చూశాడు.

మండే అగ్నిపర్వతంలా వున్నాడు.

"రాజారావ్. రఘు....రమణ."

రాబర్టు మాటలు విన్న సృజన్ బిగుసుకుపోయాడు.

"సర్....నా కర్తవ్యం ఏమిటి?"

"నీ అభిప్రాయం చెప్పు."

"ఐ వాంట్ టు డిస్ట్రాయ్ దెమ్ సార్" అరిచాడు సృజన్.

అంతలోనే తమాయించుకున్నాడు.

గొంతు వణికింది.

నిలువెల్లా ఊగిపోతున్నాడు.

రాజారావు రూపం కళ్ళముందు మెదులుతోంది. ఆ రోజు తాను వారందరి ఇళ్ళకు వెళ్ళటం....కడుపు కోతతో తన తండ్రి మరణానికి కారణం మీరే అని అంటుంటే....బలవంతంగా ఘూర్ఖాతో బయటకు నెట్టించి.... ఓహ్.... అంతులేని దుఃఖంలో తానుండి మౌనంగా రోదించటం మినహాయించి ఏం చెయ్యగలిగాడు? రావిచెట్టు నీడలో బిచ్చగాళ్ళ చెంతన విశ్రమించటం తప్పించి....పగ, ప్రతీకారం దహించివేస్తుంటే, చేతకానితనం కట్టిపడవేస్తుంటే, ఒంటరిగా, పిచ్చిగా.... కలవరింతలు....!

గుండెలు జలదరింప చేస్తున్న ఈ సత్యం విన్నాక.... ఇంకా మౌనంగానే వుండటం తనకు సాధ్యమవుతుందా? ఈ అగ్ని గోళాల్ని యెలా భరించగలడు తను. ఈ వేడికి తలలో నరాలు చిట్లి.... తల వ్రేయి ముక్కలై

పోదా? ఏం చేయాలి? ఏం చేయాలి?

సృజన్ కణతలు నొక్కుకున్నాడు.

రాబర్టు అతనినే గమనిస్తున్నాడు.

ఆయనకు వ్యక్తిగత హింసావాదం మీద నమ్మకం లేదు. ఆ విషయంలోనే రవితో అతనికి తీవ్రంగా భేదాభిప్రాయలు రావటం జరిగింది. 'రవి' మరణానికి కారకులయిన వారిపట్ల అతనికి కసిగా వుంది. కానీ వారిపై పగ సాధించే విషయంలో ఆయన ఓ అభిప్రాయానికి రాలేకపోతున్నాడు. ఆయన దృక్పథం మరింత విశాలంగా వుంది.

సృజన్ వయసుకు అలాంటివి ఆలోచించేటంత పరిణతి లేదు. అతను ఉడుకు నెత్తురుతో వున్నాడు. దిక్కులేని చావుకు గురయిన తన తల్లిదండ్రుల గుర్తొచ్చి మరీ ఉగ్రుడై పోతున్నాడు.

సృజన్ భుజంమీద చెయ్యిపడింది.

కళ్ళెత్తి రాబర్టువంక చూశాడు.

"ఏమిటి ఆలోచన."

"సర్" గొంతు గాద్గదికమయింది.

కళ్ళ వెంట నీళ్ళు టప, టప రాలాయి.

"నీ బాధ నాకు తెలుసు" అన్నారాయన.

"సర్. ఈ ప్రపంచంలో నాకున్న ఇద్దర్ని బలి తీసుకున్నారు. మా నాన్నను చంపినపుడు....డబ్బుకోసం మా అమ్మను నిర్దాక్షిణ్యంగా హత్య చేసినపుడు యెవరికి మానవత్వం వుంది. నమ్మకద్రోహం కళ్ళముందు నిలబడి వుంటే చూస్తూ ఎలా కూర్చోను."

రాబర్టు నిట్టూర్చాడు.

"ఇట్సాల్ రైట్. ఈ విషయంలో నిన్ను కంట్రోల్

చేయదలుచుకోలేదు. ఈ విషయంలో నువ్వెలా ప్రవర్తించినా నాకభ్యంతరంలేదు."

స్రుజన్ కళ్ళు మిలమిలలాడేయి.

"కృతజ్ఞతలు సార్" అన్నాడు స్రుజన్. "నాకు కొన్ని టైంబాంబ్స్ కావాలి సర్."

"ఓ.కె. మై బోయ్" అన్నాడు రాబర్టు. "అలాగే ఓ వారం రోజులు నీకు శిక్షణ ఇప్పిస్తాను."

12

వారం తర్వాత ఎయిర్ బ్యాగ్ లో పవర్ ఫుల్ టైం బాంబులు పేర్చుకొని స్రుజన్ బయలుదేరాడు.

రాజారావు ఇంటికి దూరంగా నిలబడి పరిశీలించాడు. ఆ వీధి అంతా నిర్మానుష్యంగా వుంది. కొంచెంసేపు ఆలోచించాడు. పరిస్థితులు అనుకూలించేటట్లున్నాయి. ఇంటిముందు కాపలా ఎవరూ లేరు.

స్రుజన్ హుందాగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

తలుపు మూసి వుంది.

బజర్ నొక్కాడు.

లోన ఎక్కడో మ్రోగుతూనే వుంది.

ఎవరో నడిచివస్తున్న చప్పుడు వినిపించింది.

తలుపు తెరుచుకుంది.

రాజారావ్ ప్రశ్నార్థకంగా చూశాడు.

స్రుజన్ అతన్ని నెట్టుకుంటూ లోనికి వెళ్ళాడు.

"ఎవర్నువ్" కంగారుగా అంటున్నాడు రాజారావ్. స్రుజన్ లోని మార్పు గుర్తించలేనంతగా వుంది.

స్రుజన్ తలుపు గడియవేశాడు.

చిరునవ్వులో రాజారావువంక చూశాడు.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ .... మీ రూంలో

కూర్చొని మాట్లాడుకుందాం."

రాజారావ్ సృజన్ వంక విచిత్రంగా చూస్తూ లోనికి నడిచాడు.

సృజన్ అతనితో పాటు లోనికి వెళ్లాడు.

రాజారావ్ సంభ్రమించిపోయాడు.

"నీకేం కావాలి?"

"అది తర్వాత చెబుతాను. ఈ ఇంట్లో యెవరున్నారింకా."

"ఏమిటిదంతా."

"ప్రశ్నలు వేయకు. నాకు సమాధానం కావాలి."

"నీ పద్ధతి బాగుండలేదు."

"ఇంతకంటే స్మార్ట్ గా వుండటం నా స్టైయిల్ కాదు. నాకు జవాబు రాలేదు."

రాజారావుకు కోపంతో పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అయితే అతన్ని చూస్తుంటే ధైర్యం చాలటంలేదు. ఈ రోజు ఇంట్లో ఎవరూ లేకపోవటం తన దురదృష్టం అనుకున్నాడు. మరో గంటలో తనూ బయలుదేరి వెళ్ళాల్సి వుంది. ఈ లోపు వీడెవడో దాపురించాడు.

ప్రక్కనే ఫోన్ వుంది. అది అందుకుని రింగ్ చేసే లోపు యేమైనా చేయగలిగేటట్లున్నాడు. అసలు యేమిటతని ఉద్దేశ్యం? అతనికి డబ్బు కావాలా? బంగారం కావాలా? పిచ్చివాడా?

"ఊఁ" గద్దించాడు సృజన్.

"ఎవరూ లేరు."

"వెల్ .... ఇప్పుడు చెప్పండి ....' మీకు రవి గుర్తున్నాడా."

"ఏమిటి నువ్వంటున్నది" కంగారుగా అన్నాడు.

"అదే రవి తెలుసా అని."

"ఎవరతను?"

"చ్చొచ్చొచ్చొ....ఆ నడుమ అడవుల్లో పోలీసులు పట్టుకొని పిట్టలా కాల్చారు చూశావ్....ఆ రవే."

"ఓ, అతనా" అన్నాడు రాజారావ్.

"అవును. అతనే. నీకెలా తెలుసు?"

"చందాలకోసం నా దగ్గరకు వచ్చాడు. అతని కుటుంబానికి కూడా నేను సహాయం చేశాను. అతని కొడుక్కి నేను డబ్బు ఇచ్చాను."

"ఎంత?"

"బహుశా రెండువందలు."

"ఎక్కడివి?"

"యూ ఆర్ టాకింగ్ నాన్సెన్స్....రెండువందలు ఎక్కడి వేమిటి....?"

"నువ్వు సంపాదించావా?" సృజన్ కఠినంగా అడిగాడు.

"ఏమిటీ ప్రశ్నలు?"

"నేను ప్రశ్నలే అడుగుతానని ఇందాక చెప్పాను."

"నీ అడ్డమయిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. ఇదేం కోర్టు కాదు" మొండిగా అన్నాడు రాజారావ్.

"చక్కగా గుర్తించావ్. ఇది కోర్టు కాదు. నువ్వు నీ డబ్బుతో లాయర్ల చాటునుండి తప్పుకోవటానికి.... నువ్వు సమాధానం చెప్పటం నీకే మంచిది...." జేబు లోనికి చెయ్యి పోనిస్తూ అన్నాడు.

"నీ ప్రశ్నలు అర్థరహితంగా వున్నాయి."

స్ప్రజన్ జేబులోనుండి రివాల్వర్ తీశాడు.

"ఏ సమాచారం అందచేస్తే నీకు లభించింది."

"సమాచారం ఏమిటి?" రివాల్వర్ వంక భయంగా చూస్తూ అన్నాడు.

"మిష్టర్ రాజారావ్ అమాయకత్వం నటించకు. నీకింత డబ్బెలా వచ్చిందో....నీ గత జీవితం యేమిటో... ఇన్ని సౌఖ్యాల్లో ఎలా మునిగి తేలుతున్నావో నాకు తెలుసు. కాకుంటే ఒకటే. ఇలాంటి జీవితం కోసం నిర్దాక్షిణ్యంగా మరికొందరి జీవితాల్ని బలిచేయటానికి మీరు సిద్ధపడ్డారు. రాజారావ్ ....మనుషులు మరణిస్తారు. కానీ, వారి ఆశయాలు మాత్రం బ్రతికుంటాయి. రవి చివరి కోరిక ఏమిటి?"

"నాకేం తెలుస్తుంది."

"ఆయన ఊహించుకున్న విప్లవానికి వెన్నుపోటు పొడిచిన వారిని, దాని ద్వారా బలపడి మరింత దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న వారిమీద దాడిచేయటం. తన తొందరపాటుతో, సహజమైన ఆవేశంతో, ఓ వైపునే ఆలోచిస్తూ, విప్లవంకోసం నిజాయితీగా పనిచేసి, తనూ, తనలాంటివారు బలయింది నీలాంటివారి బాగుకోసం కాదు. యే ప్రజలకోసం వారు రక్తం చిందించారో అది వృధా అయింది. దాన్ని మలినం చేస్తూ క్రొత్త రూపాంలో మీరు ముందుకొచ్చారు. ఆయన తుది కోర్కెను అమలుచేయటమే నా లక్ష్యం."

రాజారావ్ మొఖం మాడిపోయింది. అతను పూర్తిగా భయపడిపోయాడు. బహుశా 'రవికి చెందిన పార్టీ కార్యకర్త కావచ్చునను కున్నాడు.

అతని చేతిలోని రివాల్వర్ నిగనిగలాడుతోంది.

"కమాన్ ఫోన్ చెయ్యి. రమణ .... రఘుల్ని పిలిపించు. అర్జంటుగా ఇక్కడకు రమ్మని చెప్పు. కంఠంలో యే మాత్రం మార్పు కనిపించినా ...తూటా గుండెల్లో నుండి దూసుకెళ్తుంది. వేరే ఎవరికైనా ఫోన్ చేసినా సరే. అదే నీకు ఆఖరి క్షణం. షూటింగ్ లో నా నైపుణ్యం గురించి తెలియాలంటే ఓ కన్ను ఖర్చవుతుంది. చూస్తావా?"

"నో" అరిచాడు రాజారావు భయంగా.

"కమాన్ రింగవ్."

రాజారావ్ చటుక్కున ఫోన్ అందుకున్నాడు.

రివాల్వర్ కంఠానికి సూటిగా ఎయిమ్ చేయబడి వుంది.

రింగవుతోంది.

అవతల ఎవరో ఎత్తారు.

"నువ్వా రఘూ .... నేను రాజారావుని మాట్లాడుతున్నాను. అర్జెంటు పనుంది. యిక్కడకు వచ్చాక చెబుతాను. ఇంటికే రా. వెంటనే రావాలి. బయలుదేరుతున్నావా .... ఓ.. కె."

ఫోన్ పెట్టేశాడు చెమటలు కక్కుతూ.

"రమణక్కూడా చెయ్యి."

సృజన్ కళ్ళు ఎర్రగా మారిపోయాయి.

శరీరం ఆవేశంతో దహించుకు పోతుంది.

చెట్టుకు కట్టబడి గిలగిలలాడుతున్న తండ్రి కనపడుతున్నాడు.

దిక్కులేక చచ్చిపోయిన అమ్మ శవం కనపడుతోంది.

కళ్ళవెంట నీళ్ళు కారిపోయాయి. తనకు తెలియకుండానే.

రాజారావ్‌కు ఈ పరిస్థితి పిచ్చెక్కేలా చేస్తోంది. యాంత్రికంగా రమణ నెంబర్ రింగ్ చేయటం జరిగింది.

"ఎవరు....రమణా.... నేను రాజారావ్‌ని మాట్లాడుతున్నాను. నువ్వు వెంటనే బయలుదేరి రా.... మందు కోసం కాదయ్యా....అర్జెంటు పనుంది. ఇక్కడ చెబుతాను. రఘు కూడా వస్తున్నాడు. అలాగే.... వెంటనే బయలుదేరు" రిసీవర్ క్రేడిల్ చేశాడు.

ఫోన్ కున్న వైరు కత్తిరించి, భుజాన తగిలించుకున్న ఎయిర్ బ్యాగ్ క్రిందకు దించాడు సృజన్.

"ఎవరున్నావ్?" రాజారావ్ కంఠం వణికింది.

"గుర్తుపట్టలేదా? నీ కాళ్ళు పట్టుకున్నాను మా నాన్నను కాపాడమని. దారుణంగా తిరస్కరించావ్. తరిమికొట్టావ్. మీ బాబుకు బ్రతకటం చేతకాదు. నువ్వు బ్రతకటం నేర్చుకోమన్నావు. అందుకే రాజారావ్ బ్రతకటం నేర్చుకొని మరీ వచ్చాను."

"నువ్వు .... నువ్వు ..." ఆశ్చర్యంగా అంటున్నాడు రాజారావ్.

"నేనే... ఐయామ్ సృజన్ ...రవి బిడ్డని."

రాజారావ్ సృజన్‌ను అప్పుడు గుర్తుపట్టాడు. ఎంత మార్పు! తనను యాచించటానికి వచ్చిన పిల్లవాడు.... రక్షించమంటూ ప్రాధేయపడ్డ కుర్రవాడు....ఈ రోజు పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు....!

"సృజన్ ....ప్లీజ్ ....లెట్ మి లివ్."

సృజన్ నవ్వాడు తెరలు తెరలుగా.

"ఇదేమాట నేను అడిగాను. మా నాన్నను రక్షించ

మంటూ నీ కాళ్ళు పట్టుకున్నాను. ఏం చేశావ్ నువ్వు? ఆదే చెయ్యబోతున్నాను."

రివాల్వర్ ప్రక్కన పెట్టాడు.

ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాడు.

"సృజన్. నాకు బ్రతకాలని వుంది."

"ఎవరికుండదు రాజారావ్ .... చచ్చిపోయే తుదిక్షణం కూడా బ్రతుకుకోసం ఆరాటపడతాడు మానవుడు. జీవితంలోని మాధుర్యం అలాంటిది. కానీ మీ జీవితాల విషయంలో యెలాంటి దారుణాలు చెయ్యటానికైనా మీరు సిధపడ్డారు. మీలాంటి రాక్షసులు ఈ సమాజంలో బ్రతకకూడదు. మృగాలు అడవుల్లోనే బ్రతకాలి. అవి సమాజంలోకి వస్తే.... మాన్ ఈటర్‌గా మారితే ఒకటే ముగింపు.... చంపటమే."

"సృజన్ .... ప్లీజ్ .... నీకెంత డబ్బు కావాలంటే అంత ఇస్తాను" రాజారావు యేడుస్తున్నాడు.

"ఏం చేసుకోమంటావ్. నువ్విచ్చే పాపిష్టి డబ్బు ఎక్కడిది? ధర్మారావ్‌లాంటి వారు జనాన్ని దోచి సంపాదిస్తుంటే, అలాంటివారినుండి మీరు దోస్తున్నారు. వెరసి అంతా ప్రజల డబ్బే. నువ్విచ్చే డబ్బు నా తండ్రిని, తల్లిని బ్రతికించగలదా."

రాజారావ్ ముందుకొచ్చాడు.

సృజన్ బిగిసిన పిడికిలి వేగంగా కదిలింది.

"అమ్మో" అంటూ పొట్టపట్టుకు కూలబడ్డాడు.

చేతుల్ని చెక్కలా బిగించి ప్రక్కటెముకలమీద కొట్టాడు. రాజారావు నోటినుండి సన్నటి ధ్వని వెలువడింది.

స్పృహతప్పి పడిపోయాడు.

నిమిషం అలానే నిలబడి చూస్తుండిపోయాడు సృజన్.

కర్తవ్యం గుర్తుకొచ్చింది.

వెనక్కి తిరిగి బ్యాగ్ అందుకున్నాడు.

బయటనుండి తలుపు గడియ వేశాడు.

సరిగ్గా అరగంట తర్వాత ప్రేలేటట్లుగా టైంబాంబును ఎరేంజ్ చేశాడు. ఇంటిలోనికి నడిచి అన్ని ప్రాంతాల్లో అమర్చాడు. చివరి బాంబు అమర్చి నిలబడుతుండగా బజర్ మ్రోగటం వినపడింది.

సృజన్ మెట్లు దిగి తలుపు దగ్గరకు నడిచాడు.

తలుపుతీశాడు.

రమణ....

అప్పుడే కారు వచ్చి ఆగింది. డ్రైవింగ్ సీట్లోనుండి రఘు దిగివచ్చాడు.

"అర్జెంటు పనుంది రమ్మన్నాడే" అంటూ సృజన్‌ని చూసి ఆశ్చర్యంగా ఆగిపోయారు ఇద్దరూ.

"ఆయన పైగదిలో వున్నారు" అన్నాడు సృజన్.

"అలాగా" అంటూ మెట్లెక్కి వెళ్లారు.

సృజన్ తలుపు మూసి వచ్చాడు.

తలుపు తెరవగానే వారిద్దరికీ మతిపోయింది. రూమంతా చిందరవందరగా వుంది. ఓ మూల రాజారావ్ స్పృహతప్పి పడిపోయి వున్నాడు.

"ఏమిటిది?" కంగారుగా అన్నారు తమకు తెలియకుండానే.

"విప్లవం!" గాల్లో వినిపించాయి మాటలు.

కంగారుగా వెనక్కు తిరిగారు

"ఎవరు నువ్వు?"

"లోపలకు పదండి."

తమకు తెలియకుండానే లోనికి అడుగువేశారు.

"రవి....రవి మీకు గుర్తున్నాడా?"

వారి ముఖాలు పాలిపోయాయి.

"కొంతమంది సిద్ధాంతాలు నమ్ముకొని ఛస్తారు. మరి కొందరు వాటిని చంపి బ్రతుకుతారు. మీకిష్టం వచ్చిన మార్గంలో మీరు బ్రతకొచ్చు. కానీ అందుకు కొందర్ని బలిపెట్టడం సమర్థనీయం కాదు. హింసకు...హింసే మార్గం."

"ఏమిటి నువ్వంటున్నది?"

"చాలా స్పష్టంగా వుంది. మీరు చావబోతున్నారు."

"నీకెందుకు మామీద కక్ష. ఆయన చనిపోవటానికి మాదేం తప్పులేదు. మమ్మల్ని విడిచిపెట్టు...."

" నేను రవి బిడ్డను."

వారి కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూసింది.

వాళ్ళు మాట్లాడుతున్నా ఆ గదినంతా పరిశీలిస్తూనే వున్నారు.

"మమ్మల్ని క్షమించు" అంటూనే రఘు సృజన్ గుండెలమీద తన్నాడు. వెనక్కు తూలాడు సృజన్.

గాల్లోకి లేచిన సృజన్ కాలు విసురుగా రఘు నడుమును తాకింది.

అడ్డం వచ్చిన సోఫాతో పాటు విసురుగా వెళ్ళి గోడకు గుద్దుకొని పెద్దగా అరిచాడు. మరుక్షణం స్పృహ కోల్పోయాడు.

రమణకు నోటివెంట మాట రావటంలేదు.

స్ప్రజన్ అతనిపై పుఢ తిరిగాడు.

"ఫట్"మంటూ కడుపులో ఓ పంచ్ ...

ప్రేగులు ఉండలు చుట్టుకొని వుంటాయి ఆ దెబ్బకు.

మోకాళ్ళమీద కూలబడ్డాడు.

గాల్లోకి లేచిన స్ప్రజన్ హస్తం....

రమణ తలమీద పడింది....

రంగుల ప్రపంచం ఒక్కసారి గిరుక్కుమంది.

ఆ తర్వాతేం జరిగిందో అతనికి తెలియదు.

టైం చూసుకున్నాడు. ఇంకా పదినిమిషాలుంది.

బ్యాగ్ భుజానికి తగిలించుకొని బయటకొచ్చాడు.

రూమ్ తలుపులు వేసి బయటనుండి తాళం వేశాడు.

మెట్లు దిగివచ్చాడు.

ముఖద్వారం తలుపులు మూసి గడియ పెట్టాడు.

అతని మనసులో ఎలాంటి ఆలోచనలేదు.

నిర్వికారంగా నడుచుకుంటూ ఆ రోడ్డు చివరకెళ్ళాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

నిలబడి వాచీవంక చూసుకున్నాడు.

ఇంకా మూడు నిమిషాలుంది.

క్షణాలు గడుస్తున్నాయి.

"ఢాం."

భవనం ఊగిపోయింది.

రాళ్ళు గాల్లోకి లేచాయి.

శబ్దాలు వినిపిస్తూనే వున్నాయి.

ముగ్గురి శరీరాలు గాల్లోకి లేచి ... ముక్కలుగా విసిరి వేయబడ్డాయి.

ఆ భవనం కూలిపోయి రాళ్ళగుట్టగా మిగిలింది.

వాటి నడుమ ముగ్గురూ సమాధికాబడ్డారు.

సృజన్ కు ఇంకా శబ్దాలు వినిపిస్తూనే వున్నాయి.

కంగారుగా జనం అటూ, ఇటూ పరిగెత్తటం చూస్తూనే వున్నాడు. ఓ క్షణం అతనిలోని అంతరాత్మ నిలదీసింది.

"నువ్వు చేసిందేమిటి?"

అంతలోనే మామూలు మనిషయ్యాడు.

అక్కడినుండి బయలుదేరాడు.

—:అ యి పో యి ం ది:—